ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

# SUPHALA AKSHARAM

## శంషాబాద్‌లో అత్యవసరంగా దిగిన విమానం

- సాంకేతిక లోపంతో మారిన మార్గం
- భయాందోళనలకు గురైన ప్రయాణికులు
- సురక్షిత ల్యాండింగ్‌తో ఊరట




➢ 2వ పేజిలో..

SUNDAY 31ST MAY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 74 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 31 మే 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 74 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయను

- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా
- లేపకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం

రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు

- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,మే30 తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా

➢ మిగతా 2వ పేజిలో..



## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

- జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం
- కేశవరావు కమిటీ తొలి భేటీ

హైదరాబాద్,మే30 తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు

➢ మిగతా 2వ పేజిలో..

## కర్నాటక సిఎల్‌పి నేతగా డికె ఏకగ్రీవ ఎన్నిక

- 3న ప్రమాణ స్వీకారానికి పార్టీ నిర్ణయం
- డికెను సిఎల్‌పి నేతగా ప్రతిపాదించిన సిద్దరామయ్య
- నాయకత్వ మార్పు సజావుగా జరిగిందన్న కెసి వేణుగోపాల్

బెంగళూరు,మే30 కర్ణాటక కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నికైన డీకే శివకుమార్ జూన్ 3న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఆయన ప్రమాణ తేదీ అధికారికంగా ఖరారైంది. జూన్ 3న కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం ప్రకటించారు. సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నికైన అనంతరం మీడియాతో ఆ వివరాలను కేసీ వేణుగోపాల్

➢ మిగతా 2వ పేజిలో..

## మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

- కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు
- బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు
- కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి



హైదరాబాద్,మే30 మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని

➢ మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధం

- మహాధర్నాలో కేటీఆర్ ఘాటు విమర్శలు
- జీవో పదిహేడు రద్దు చేయాలని డిమాండ్
- బడుగు వర్గాల హక్కులకై పోరాటం

2

## రైతులకు వాతావరణ సూచనలు

- తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం
- ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



2




## అధికారంలోకి వచ్చిన వెంటనే 111 జీవోను ఎత్తివేస్తాం

- అంబేద్కర్‌కు నివాళులు అర్పణ
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- మొయినాబాద్‌లో కవిత రాజకీయ గర్జన

2

# పట్టణ పేదలకు పెద్దన్న రేవంత్ రెడ్డి కానుక

- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పధకాలు
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి




హైదరాబాద్,మే30 పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించ బోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు

➢ మిగతా 2వ పేజిలో..

## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయను

బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ధి కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

### కర్నాటక సిఎల్‌పి నేతగా
## డికె ఏకగ్రీవ ఎన్నిక

పంచుకున్నారు. సీఎల్‌పీ నేతగా డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు చెప్పారు. డీకే పేరును కాంగ్రెస్ అధిష్టానం సూచించగా, తొలుత సిద్ధరామయ్య, ఆ తర్వాత పరమేశ్వర ఆయన పేరును సీఎల్‌పీ సమావేశంలో ప్రతిపాదించారని, ఏకగ్రీవంగా దీనికి ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారని వివరించారు. ముఖ్యమంత్రి మార్పు కాంగ్రెస్ పార్టీకి సమస్య అవుతుందని అంతా భావించారనీ, అయితే తమదంతా ఒక కుటుంబమని, అంతా ఏకగ్రీవంగా ఈ ఎన్నికను ఆమోదించడం పార్టీకి గర్వకారణమని అన్నారు. 2028లోనూ నాయకులందరికీ సపోర్ట్‌తో కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అదికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో సిద్ధరామయ్య ఈనెల 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్ సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇదిలావుంటే అంతకుముందు కర్ణాటకలో నాయకత్వ మార్పు ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది. మరోవైపు జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. ఇందుకోసం బెంగళూరులోని లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిపింది. తాజాగా సీఎల్పీ నేతగా ఎన్నికైన డీకేఎస్.. గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు తనను ఆహ్వానించాలని కోరనున్నారు. పరిశీలకులుగా కెసి వేణుగోపాల్,జైరాం రమేశ్ హాజరయ్యారు.

## పట్టణ పేదలకు పెద్దన్న రేవంత్ రెడ్డి కానుక



నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ – గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

➢ మొదటి పేజి తరువాయి

విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమీషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్నీ బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు. ధాన్యం సేకరణపై కేంద్రం గతంలో 9 సార్లు పొడిగింపు ఇచ్చింది. ఎప్పుడూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలో బీర్ఎస్ అదే పని చేసింది. కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన కోటను పూర్తి చేయలేదు. 52.24 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రంతో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.

## రైతులకు వాతావరణ సూచనలు



హైదరాబాద్,మే30: రాష్ట్రంలోని రైతులకు నమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికా రికంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భంగా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# కాంగ్రెస్‌ను బొంద పెట్టేందుకు ప్రజలు సిద్ధం

హైదరాబాద్, మే 30 : ఇందిరాపార్కు వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వమే కారణమని విమర్శించారు. ఎన్నికల సమయంలో చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కల్పిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. మొత్తం 72 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాలకు 72 పైసలు కూడా ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. బడుగు వర్గాల ఆర్థిక పురోగతికి తోడ్పడాల్సిన ప్రభుత్వం వారిని మరింత వెనక్కి నెట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గురుకుల పాఠశాలలకు సరఫరా చేసే కూరగాయలు, పాలు, చికెన్, బ్రెడ్ వంటి వస్తువుల టెండర్లు స్థానిక చిన్న కాంట్రాక్టర్లకు దక్కకుండా జీవో నంబర్ 17ను తీసుకొచ్చారని కేటీఆర్ ఆరోపించారు. ఈ జీవో ద్వారా చిన్న కాంట్రాక్టర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. పెద్ద కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. జీవో 17ను వెంటనే రద్దు చేయాలని, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టుల్లో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంట్రాక్టుల వ్యవస్థ పూర్తిగా కొందరి చేతుల్లోకి వెళ్లిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, భారీ కాంట్రాక్టులు కొద్దిమందికే కేటాయిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేసిన అప్పులు, చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు, కేటాయించిన పనులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల డబ్బు ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కేటీఆర్ ప్రస్తావించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సంపద సృష్టించి పేదలకు పంచే విధానాన్ని అమలు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు, గురుకుల విద్యాసంస్థలు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. బడుగు వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, చిన్న వ్యాపారులు, కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కేటీఆర్ అన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో బడుగు వర్గాల సమస్యలపై మరింత బలంగా పోరాటం చేస్తామని ప్రకటించారు. అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. 2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఆ సమయంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వేలాది మంది యువతను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. గతంలో పదివేల మందికి అవకాశాలు కల్పించినట్లే భవిష్యత్తులో యాభై వేల మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. బడుగు వర్గాల హక్కుల కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అధికారంలోకి వచ్చిన వెంటనే 111 జీవోను ఎత్తివేస్తాం

- అంబేద్కర్‌కు నివాళులు అర్పణ
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- మొయినాబాద్‌లో కవిత రాజకీయ గర్జన

మొయినాబాద్, మే 30 తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మొయినాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా తెలంగాణ రక్షణ సేన ప్రజల ముందుకు వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, అధికారంలోకి వచ్చిన వెంటనే 111 జీవోను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. ఈ జీవో కారణంగా మొయినాబాద్, చేవెళ్ల పరిధిలోని అనేక గ్రామాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జీవో రద్దు అయితే భూములకు మంచి విలువ లభిస్తుందని, రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశించారని, అయితే అనేక అంశాల్లో ఆ ఆశలు నెరవేరలేదని ఆమె వ్యాఖ్యానించారు. తెలంగాణ హక్కులను పరిరక్షించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తెలంగాణ రక్షణ సేన కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కవిత, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ విధానాల వల్ల ఈ రంగం కూడా ప్రభావితమైందని అన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకోసం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మైనారిటీ వర్గాల నుంచి తమ పార్టీకి విశేష ఆదరణ లభిస్తోందని కవిత తెలిపారు. పెద్ద సంఖ్యలో మైనారిటీలు పార్టీలో చేరడం వల్ల సంస్థాగతంగా మరింత బలపడినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో సామరస్య సంస్కృతిని కాపాడేందుకు తమ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. మహిళలు, యువత సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని కవిత హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా వ్యాపార రంగంలో ఎదగడానికి ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే మహిళలు, రైతులు, యువత సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తామని వెల్లడించారు.

## శంషాబాద్‌లో అత్యవసరంగా దిగిన విమానం

హైదరాబాద్, మే 30 శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగోకు చెందిన ఓ విమానం అత్యవసరంగా ల్యాండ్ కావడంతో కొద్దిసేపు ఉత్కంఠ నెలకొంది. బెంగళూరు నుంచి నాగపూర్‌కు బయలుదేరిన ఈ విమానంలో ప్రయాణ మధ్యలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలట్ అప్రమత్తమై వెంటనే విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి మంజూరు చేశారు. విమానంలో మొత్తం 126 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. సాంకేతిక లోపం గురించి సమాచారం అందడంతో ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. అయితే పైలట్ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొంటూ విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.

## ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.2.00 కోట్ల గ్రంథాలయ సెస్ నిధుల

- విడుదలకు మున్సిపల్ కమిషనర్ హామీ..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వసూలు చేసిన గ్రంథాలయ సెస్ నిధులలో పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని విడుదల చేయాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎం.డి. ఖాదర్ బాబా , కార్యదర్శి శ్రీమతి కె. కరుణ కుమారి, కార్యాలయ సిబ్బంది వి. అఖిల్, జె. భాస్కర్ రావులు ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని కేంద్ర, శాఖ మరియు గ్రామీణ గ్రంథాలయాల నిర్వహణకు గ్రంథాలయ సెస్ ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నందున పెండింగ్ నిధులను విడుదల చేయడం అత్యవసరమని వివరించారు. గ్రంథాలయాల నిర్వహణ, పాఠకులకు మెరుగైన సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిధుల అవసరాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపై సానుకూలంగా స్పందించిన ఖమ్మం మున్సిపల్ కమిషనర్, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ నిధులలో రూ. 2.00 కోట్లను త్వరలోనే జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఖాతాకు బదిలీ చేయనున్నట్లు హామీ ఇచ్చారు . మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన హామీ పట్ల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా హర్షం వ్యక్తం చేస్తూ, గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తున్న మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30( అక్షరం న్యూస్)

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారుబి. నాగేశ్వర్ రావు, ఎస్సై డబ్ల్యూ పిఎస్ ,ఎన్. ఉప్పయ్య, ఏఎస్ఐ ఖమ్మం ×× టౌన్ఎం. గురునాధం, ఏఎస్ ఐ ముదిగొండపీ. ప్రకాష్ రావు, హెచ్ సి మదిర టౌన్పి. లక్ష్మణ్ రావు (ఎస్సై కమ్యూనికేషన్)కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ ఐ లు కామరాజు, అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## డిజిపిని కలిసిన కూనంనేని..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30( అక్షరం న్యూస్)

ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ను కొత్తగూడెంశాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ -సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతర అంశాలపై చర్చించారు. సివి ఆనంద్ పాలనలో పోలీసులు మరింత సమర్ధవంతంగా సేవలు అందించాలని రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించాలని కూనంనేని ఆకాంక్షించారు. కూనంనేని వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సమితి -సభ్యులు ఎస్కె జానిమియా తదితరులు ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం...

- 20వార్డ్ కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు
- ఖాళీ స్థలాలు, శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్
- యజమానులకు నోటీసులు అందించిన.. మున్సిపల్ సిబ్బంది



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 వైరా (అక్షరం న్యూస్)

పరిసరాల పరిశుభ్రత అనే ఆరోగ్యమని వైరా 20 వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు అన్నారు. ముందస్తు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైరా మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ఆదేశాలు మేరకు మున్సిపాలిటీలో ఉన్నటువంటి శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు చెత్తాచెదాన్ని తొలగించాలని, కోరుతూ వైరా 20 వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో ఖాళీ ప్లాట్లు, శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్ యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. ఎవరైనా ఖాళీ స్థలాల యజమానులు అందరూ కూడా మీ ఇక స్థలాన్ని శుభ్రపరుచుకోవాలని వారు సూచించారు. వార్డులో శిథిలావస్థలో ఉన్న బిల్డింగులు, స్థలాలలోని ఉన్న పిచ్చి మొక్కలను చెత్తాచెదారాన్నితొలగించకపోతే, మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాంకుడోత్ బిక్య, పండు, దర్గయ్య, పృథ్వి, రాజు, కొత్తపల్లి శేషగిరి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలగవరం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన ఎంపీడీవో ఏ శ్రీధర్ రాజు,సర్పంచ్ భూక్యా కాళోజీ

- ఇందిరమ్మ ఇల్లును పరిశీలన చేసిన ఎంపీడీవో..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 తల్లాడ (అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిధిలోని తెలగవరం గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ భూక్యా కాళోజీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం శనివారం తల్లాడ మండల ఎంపీడీవో శ్రీధర్ రాజు చేతుల మీదుగా ఈజీఎస్ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాళోజీ మాట్లాడుతూ ఈ వేసవికాలం దృష్ట్యా,ఎండలు అధికమవడంతో కూలీల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసామని, ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి మంచినీటి సౌకర్యం టెంట్లు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని జాగ్రత్తలు సూచించారు. తెలగవరం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళను ఎంపీడీవో శ్రీధర్ రాజు తో కలిసి సర్పంచ్ ఉప సర్పంచ్ తల్లాడ మండల హౌసింగ్ ఏఈ ఆషా, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ఇళ్లను సందర్శించి, పనులు ఉన్న త్వరగా పూర్తిచేయాలని తమ సూచనలు చేశారు .

ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది. తెలగవరం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లాడ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వారాల అజయ్, మండల పరిషత్ సిబ్బంది, వెంకట రామారావు, కృష్ణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి చిన్నారులకు స్కూల్ యూనిఫాంల పంపిణీ

- చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- సర్పంచ్ కొండవేనా దివ్య సుధాకర్




రామగిరి, పెద్దపల్లి జిల్లా, మే 30 (అక్షరం న్యూస్):

రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో శనివారం అంగన్వాడి కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులకు స్కూల్ యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు యూనిఫాంలను అందజేసి వారి విద్యాభివృద్ధికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండవేనా దివ్య సుధాకర్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని పిల్లల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చిన్నారులకు యూనిఫాంల పంపిణీ చేయడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాసం సతీష్, రామగిరి మండల అంగన్వాడి సూపర్వైజర్ రజిత, అంగన్వాడి టీచర్లు భద్రపు లావణ్య, సుగుణ బాయి, మల్లేశ్వరి అలాగే పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సమ్మర్ కోచింగ్ శిబిరాలను పరిశీలించిన48వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30( అక్షరం న్యూస్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ) ఆధ్వర్యంలో పాల్వంచ శ్రీనివాస కాలనీలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను స్థానిక 48వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా చిన్నారులకు క్రీడా శిక్షణ అందిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్న క్రీడా శిక్షకుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి అత్యధిక పతకాలు సాధించడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. అనంతరం అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, ఆర్చరీ కోచ్ కళ్యాణ్, టెన్నిస్ కోచ్ డేనియల్ రాంబాబు, అథ్లెటిక్స్ కోచ్ ఎర్రయ్య పవన్‌లను ఆయన అభినందించారు. స్థానిక ఈవెంట్ మేనేజర్ కె. రమేష్ మాట్లాడుతూ, క్రీడాకారుల అభివృద్ధికి తన వంతు సహకారం, ప్రోత్సాహం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్‌తో పాటు ఇతర క్రీడా ప్రముఖులు, శిక్షకులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 వైరా (అక్షరం న్యూస్)

వైరా లో కురిసిన భారీ వర్షాల కారణంగా 8వ వార్డు 6వ వార్డ్ విద్యుత్ స్తంబాలు విరిగిపడ్డాయి. ఈ విషయాన్ని 8వ వార్డు కౌన్సిలర్ చిలకకోటయ్య వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లగా, చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ వెంటనే స్పందించి విద్యుత్ శాఖ డీఈ రమేష్ , ఏఈ సాయి మరియు నరేష్ ఏఈ కి సమాచారం అందించారు. వారి సహకారంతో వెంటనే కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## ఎన్‌టిపీసీ రామగుండం సౌర విద్యుత్ ప్రాజెక్టులో మరో 34.4 మెగావాట్ల సామర్థ్యం ప్రారంభం.. ఎన్టిపిసి స్థాపిత సామర్థ్యం 44 44 మెగావాట్లు



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

దేశంలోని అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ అయిన ఎన్‌టిపీసీ, తెలంగాణలోని రామగుండం సౌర విద్యుత్ ప్రాజెక్టులో మరో కీలక మైలురాయిని సాధించింది. మొత్తం 176 మెగావాట్ల సామర్థ్యం గల రామగుండం సోలార్ పీవీ ప్రాజెక్టులో భాగంగా 34.4 మెగావాట్ల రెండో దశ సామర్థ్యాన్ని వాణిజ్యపరంగా (సి ఓ డి) ప్రారంభించినట్లు ఎన్‌టిపీసీ ప్రకటించింది. ఈ యూనిట్ విజయవంతంగా పరీక్షలు పూర్తిచేసుకుని 2026 మే 29 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ఇంతకుముందు ఈనెల 2న ఇదే ప్రాజెక్టులో తొలి దశగా 100 మెగావాట్ల సామర్థ్యాన్ని వాణిజ్యపరంగా ప్రారంభించారు. తాజా 34.4 మెగావాట్ల సామర్థ్యం జోడించడంతో ఇప్పటివరకు మొత్తం 134.4 మెగావాట్ల సామర్థ్యం గ్రిడ్‌కు అందుబాటులోకి వచ్చింది. 27 రోజుల్లోనే రెండవ దశ ప్రారంభించడం విశేషం. ప్రస్తుతం రామగుండంలో 34 మెగావాట్లు చేరడంతో స్థాపిత సామర్థ్యం 4444 మెగావాట్లకు చేరుకున్నది. మొత్తం 176 మెగావాట్ల ప్రాజెక్టులో మిగిలిన సుమారు 41.6 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించిన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. మిగిలిన యూనిట్లు కూడా త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉంది. రామగుండం సౌర విద్యుత్ ప్రాజెక్టు దశలవారీగా అభివృద్ధి చెందుతూ తెలంగాణలో ఎన్‌టిపీసీ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా పరిశుభ్రమైన విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో పాటు కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు కూడా తోడ్పాటు లభించనుంది. తాజాగా 34.4 మెగావాట్ల సామర్థ్యం ప్రారంభం కావడంతో ఎన్‌టిపీసీ గ్రూప్ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 90,807 మెగావాట్లకు, వాణిజ్య సామర్థ్యం 88,927 మెగావాట్లకు పెరిగింది. దేశంలో పునరుత్పాదక ఇంధన రంగ విస్తరణలో ఎన్‌టిపీసీ కీలక పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతోంది. ఎన్టిపిసి రామగుండంలో 2600 మెగావాట్ల థర్మల్ పవర్ స్టేషన్, 1600 మెగా వాట్ల తెలంగాణ థర్మల్ పవర్ స్టేషన్,100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ స్టేషన్, 144 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ ఫోటో వాల్టాయిక్ సోలార్ పవర్ స్టేషన్ లో విద్యుత్పత్తి జరుగుతున్నది.

## కర్మకాండ భవన నిర్మాణం కొరకు ఐదు లక్షల విరాళము ప్రకటిస్తున్నఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించండి..

- ఆర్య సంఘ అభివృద్ధికి కృషి చేస్తా..
- ఆర్యవైశ్య పట్టణ అధ్యక్ష అభ్యర్థి కుక్కడపు శ్రీనివాస్




సూర్యాపేట మే 30(అక్షరం న్యూస్ ):
ఈనెల 31న ఆదివారం జరిగే ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడి ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి అహర్నిశలు శక్తి వంచన లేకుండా శ్రమిస్తానని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అభ్యర్థిగా పోటీచేస్తున్న కుక్కడపు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి రవి మహల్ లో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తనకు అధ్యక్ష పదవి ఇస్తానని మాట తప్పారని, మా తండ్రి స్వాతంత్ర్య సమరయోధులుగా కుక్కడపు జానకి రామయ్య ఆర్యవైశ్యులందరికీ సుపరిచితుడని ఎన్నో ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేశారని, వారి కుమారుడిగా నేను ముందుకొస్తున్నానని తనను ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు. ఆర్యవైశ్యులు కొందరు కిరాయి ఇండ్లలో ఉంటూ నివసిస్తు, కుటుంబ సభ్యులు చనిపోతే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని కర్మకాండల భవన్ నిమిత్తం ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తానని తెలిపారు. పేద వైశ్యులకు, విద్యార్థులకు, పేద ఆర్యవైశ్య పిల్లల వివాహ ఖర్చులకు, కూడా తన వంతు ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు .మీ అందరి వాడిగా సేవా దృక్పథంతో ముందుకు వస్తున్నానని కావున మీ అమూల్యమైన ఓటుతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కుక్కడపు జానకి రామయ్య, రాచర్ల వెంకటేశ్వరరావు, పాల్వాయి రవికుమార్, ఈగ వెంకటేశ్వర్లు, వెంపటి అజయ్, కర్నాటి రవి, వాసా నరసింహారావు, కర్నాటి వంశీ, శ్రీకాకోళపు చలపతిరావు,రాము, పోలా రాధాకృష్ణ, యామా ప్రభాకర్, గుడుగుంట్ల విద్యాసాగర్ రావు, తల్లాడ సోమయ్య,,చక్కా లక్ష్మయ్య, బొమ్మిడి శ్రీను, మొరిశెట్టి రాజా, వనమా శంకర్, అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## పాస్టర్ భానోత్ అనిల్‌కు మాతృవియోగం..

- కుటుంబ సభ్యులను పరామర్శించిన బిషప్ దుర్గం ప్రభాకర్ ..
- బేతెస్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, ప్రత్యేక ప్రార్థనలు..



సూర్యాపేట, మే 30 (అక్షరం న్యూస్ ):
సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డుకు చెందిన పాస్టర్ భానోత్ అనిల్ తల్లి భానోత్ చాంది (90) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ క్రీస్తునందు తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో శనివారం వారి కుటుంబాన్ని ప్రముఖ క్రైస్తవ మత పెద్దలు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్, బ్రదర్ ఇరుగు సంసోను ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. మరణించిన భానోత్ చాంది ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ప్రసాదించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే బేతెస్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కష్టకాలంలో ఒకరికి ఒకరు తోడుగా నిలవడం క్రైస్తవ ధర్మంలోని ముఖ్యమైన విలువ అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. బాధలో ఉన్న కుటుంబాలకు ఆధ్యాత్మికంగా, సామాజికంగా అండగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భానోత్ రంజా నాయక్, టీఆర్పీ నాయకులు భానోత్ చాంప్లా, రెవ. ఏర్పుల క్రిస్టోఫర్, పాస్టర్ కొమ్ము హోసన్నా, పాస్టర్ దేవత్ రమేష్, పాల్వాయి అజయ్, భానోత్ ప్రమీల అనిల్, భానోత్ దానియేలు, భానోత్ దీవెన, శ్రీధర్ నాయక్, చిన్న రాయుడు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. మృతురాలు భానోత్ చాంది ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని పాల్గొన్న దైవజనులు ప్రార్థించారు.

# అవయవ రక్షణ శస్త్రచికిత్సల్లో టిఆర్ ఆర్ హాస్పిటల్‌కు విశేష విజయాలు..

- ఇలిజారోవ్ పద్ధతితో 13 సెం.మీ. ఎముక పునర్నిర్మాణం ..
- కాలు తొలగించే పరిస్థితి నుంచి రోగికి కొత్త జీవితం..
- ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స
- నిపుణులు డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్




ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 (అక్షరం న్యూస్)
క్లిష్టమైన ఎముక గాయాలు, ఇన్‌ఫెక్షన్లు మరియు ప్రమాదాల్లో అవయవ రక్షణ చికిత్సలో ఖమ్మంలోని టిఆర్ ఆర్ ఆర్థో యాక్సిడెంట్ కేర్ హాస్పిటల్ వైద్య బృందం విశేష ఫలితాలు సాధించినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం ఏడాదిన్నర కాలంలోనే అనేక అరుదైన, క్లిష్టమైన ఆర్థోపెడిక్ కేసులకు విజయవంతంగా చికిత్స అందించినట్లు వెల్లడించారు. వైద్యుల వివరాల ప్రకారం, తీవ్రమైన క్రష్ ఇంజరీలతో ఎముకలు, మృదు కణజాలం దెబ్బతిన్న పలువురు రోగులకు ఇలిజారోవ్ టెక్నిక్ ద్వారా అవయవ రక్షణ చికిత్స అందించారు. ఈ పద్ధతిలో ఎముక పెంపు (దీశీఅవ ాావఅన్త్ర్షవఅఱఅన్త్ర) మరియు ఎముక పునర్నిర్మాణం (దీశీఅవ =వషశీఅర్‌తీబష్‌ఱశీఅ) చేసి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. శ్రీలత అనే మహిళకు జరిగిన తీవ్రమైన క్రష్ ఇంజరీ తర్వాత ఇలిజారోవ్ పద్ధతితో 12.2 సెంటీమీటర్ల ఎముక పెంపు చేసి అవయవాన్ని కాపాడినట్లు పేర్కొన్నారు. అలాగే ఇన్‌ఫెక్టెడ్ నాన్-యూనియన్ టిబియా సమస్యతో బాధపడుతున్న ఉదయ్‌కు 6 సెంటీమీటర్ల లింబ్ లెంగ్తెనింగ్, సురేష్‌కు 8 సెంటీమీటర్ల ఎముక పెంపు విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన కేసుగా లారీ డ్రైవర్ సోమేశ్వరరావు చికిత్సను వైద్యులు వివరించారు. రెండు కాళ్లలో తీవ్రమైన క్రష్ ఇంజరీలు, విస్తృతమైన సాఫ్ట్ టిష్యూ నష్టం కారణంగా కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడినప్పటికీ, ఇలిజారోవ్ పద్ధతి, స్కిన్ గ్రాఫ్టింగ్ మరియు దీర్ఘకాలిక పునరావాస చికిత్సల ద్వారా 13 సెంటీమీటర్ల ఎముక పునర్నిర్మాణం చేసి అవయవాలను కాపాడగలిగినట్లు తెలిపారు. సుమారు 13 నెలల చికిత్స అనంతరం రోగి తిరిగి నడిచే స్థితికి చేరుకున్నట్లు చెప్పారు. అదే విధంగా, తీవ్రమైన వాల్గస్ డిఫార్మిటీ, ఆస్టియోఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్న ప్రమీలకు టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స నిర్వహించి సాధారణ జీవితం అందించినట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, దాడుల కారణంగా బహుళ ఫ్రాక్చర్లు, తలకు గాయాలతో చేరిన పలువురు రోగులకు దశలవారీ శస్త్రచికిత్సలు నిర్వహించి పూర్తిగా కోలుకునేలా చేసినట్లు తెలిపారు. ఈ విజయాలు వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఫిజియో థెరపిస్టులు మరియు ఇతర సిబ్బంది సమిష్టి కృషి ఫలితమని డాక్టర్ లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అత్యాధునిక వైద్య సాంకేతికతతో ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

### మంత్రి పొంగులేటి ఆదేశాలతో పీఎస్ఆర్ చారిటబుల్

# ట్రస్ట్ ద్వారా మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 (అక్షరం న్యూస్)
ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుతున్న తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం మండల పరిధిలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని బాలాజీ నగర్ తండా, వెదుళ్ల చెరువు, పిండిప్రోలు, తెట్టేలపాడు, కేశవాపురం,తిప్పారెడ్డిగూడెం, అజ్మీర తండా, జల్లేపల్లి, హైదర్ సాయిపేట, పడమటి తండా, జోగులపాడు, పాతర్లపాడు, గోల్ తండా, చంద్రు తండా, దమ్మాయిగూడెం గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున 100 కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి వారి కుటుంబాలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కూసుమంచి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి నైజమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో పేద మరియు బలహీన వర్గాల కుటుంబాలకు అండగా నిలుస్తూ పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాలకు అందించిన ఈ ఆర్థిక సహాయం కేవలం డబ్బు మాత్రమే కాదని, కష్టకాలంలో తమకు తోడుగా నిలిచే నాయకత్వం ఉందనే ధైర్యాన్ని కల్పించిందని లబ్ధిదారులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను స్థానిక ప్రజలు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని కోరారు. "ప్రజల కష్టాల్లో తోడుగా.. ఆపదలో అండగా.. మానవత్వమే లక్ష్యంగా పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు కొనసాగుతున్నాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల అశోక్ మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్. మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు -- కేక్ కటింగ్ -- పులిహోర ప్రసాదం పంపిణీ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్



రామగిరి, పెద్దపల్లి జిల్లా, మే 30 (అక్షరం న్యూస్):
తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు శనివారం రామగిరి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేపల్లి గ్రామంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం పలు గ్రామాల్లో కేక్ కట్ చేసి మంత్రి శ్రీధర్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లద్నాపూర్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు తోగరి చంద్రయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సహిత శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయం, శ్రీ శ్రీరామ దాసాంజనేయ స్వామి ఆలయాల్లో మంత్రి శ్రీధర్‌బాబు పేరిట ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మంత్రి ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గొర్రె నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు, గ్రామ ప్రజలకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న, మాజీ జడ్పీటీసీ మైదం వరప్రసాద్, లద్నాపూర్ గ్రామ సర్పంచ్ వనం రామచంద్రరావు, మాజీ సర్పంచ్ బీవీ స్వామి గౌడ్, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య, మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం, మాజీ సర్పంచ్ తీగల సమయ, సందల కుమారస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండె పోషం, కలవల శంకర్,కే మోహన్, ఉపసర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామగుండంలో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
ఐక్య పోరాటాల వారధి, ఉద్యమాల సారధి సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రామగుశీడలో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను హమాలీ యూనియన్ నాయకులు మార్త పోచం జెండాను ఎగుర వేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఐక్యత పోరాటం తో 1970 మే 30 న ఆవిర్భావించిన సీఐటీయూ, ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిస్కారం అవుతాయాని, ఆచరణలో రుజువైనది. ఈ దేశంలో అమలు చేస్తన్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన ఐక్యపోరాటాలు, సమ్మెలు నిర్వహించడశీలో సీఐటీయూ కీలక పాత్ర పోషించింది. కార్మికుల ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండ, సామాజిక న్యాయం, మతసా మరస్యాన్ని కాపాడడానికి, ఈ దేశంలో దోపిడీ రహిత, కార్మిక రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నది. రాబోయే రోజుల్లో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు, 4 లేబర్ కోడ్స్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటల్లో కార్మికులు భగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో మార్త పొచం, కీర్తి వెంకటేష్, రమేష్, రాములు, సంతోష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## రవికుమార్ ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని పోచమ్మ దేవాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బ్లాక్-1 అధ్యక్షుడు మాదారబోయిన రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పరపు మానస శరత్, కంకణాల మౌనిక రాజు, పెద్దెల్లి ప్రకాష్, వీరబోయిన రవి యాదవ్, బొమ్మక రాజేష్, నాంపల్లి రాజ్, పిచర శ్రీనివాస్, గడ్డం శ్రీను, మల్లికార్జున్, మంద రమేష్, పంజా శ్రీనివాస్, సింహాచలం, నాజీమోద్దీన్, రహీమ్, హమీద్, సుతారి లక్ష్మణ్ బాబు, నాయిని ఓదెలు, గడ్డం శేఖర్, సతీష్ గౌడ్, యదా వెంకటరమణ, బొంతల లచ్చన్న, నారాయణ, శంకర్, శ్రీను, చంద్రమౌళి, గడ్డం సతీష్, మీసాల సతీష్, తిరుపతి, విజయ్ మోహన్, బంగారి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు చీరల పంపిణీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు స్థానిక లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ మహంకాళి స్వామి హాజరై కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ మహిళా కార్మికులకు చీరలు మరియు బట్టల ను పంపిణి చేసారు. కొప్పుల శంకర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రిగా శ్రీధర్ బాబు ఎదగాలని కొప్పుల శంకర్ కొనియాడారు. ఈ కార్యక్రమం లో లీగల్ సెల్ నాయకులు మాదాసు శ్రీనివాస్, ముస్కె రవికుమార్, మహమ్మద్ తాజ్, సీనియర్ న్యాయవాదులు మేడ చక్రపాణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాల్వా లింగస్వామి, మారేల్లి రాజిరెడ్డి,నాయిని ఓదెలు కార్పొరేటర్ చిదురాల నాగరాజు, న్యాయవాదులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## పీజీ కాలేజీలో పాలిసెట్ 2026 అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల లో పాలీసెట్ 2026 అభ్యర్థుల యొక్క ధ్రువ పత్రాల పరిశీలన కార్యక్రమం కొనసాగుతున్నదని కళాశాల ప్రిన్సిపల్ మరియు పాలీసెట్ హెల్ప్ లైన్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ ఇనుగాల మనోహర్ తెలిపారు. పాలీసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు పాలిసెట్ ర్యాంక్ కార్డ్ హాల్ టికెట్ పదవ తరగతి మెమో స్టడీ సర్టిఫికేట్ ( 4 వ తరగతి నుండి పదవ తరగతి వరకు) కుల ధ్రువీకరణ పత్రము, ఆదాయం సర్టిఫికెట్(1-1- 2026 తర్వాత) పదవ తరగతి టిసి ఆధార్ కార్డ్ జుబౌ సర్టిఫికెట్ ల యొక్క జిరాక్స్ కాపీని మరియు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని పాలిసెట్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ తెలిపారు నేడు జరిగిన పాలీసెట్ కౌన్సిలింగ్ లో వెరిఫికేషన్ అధికారులు డాక్టర్ వై ప్రసాద్ శ్యాం కుమార్ జ్యోతి సావిత్రి రఘుపతి పాల్గొన్నారు నేడు జరిగిన కౌన్సిలింగ్ కార్యక్రమంలో 130 విద్యార్థులు పాల్గొన్నారు పాలీసెట్ కౌన్సిలింగ్ కి హాజరైన విద్యార్థులు తమకు కేటాయించబడిన లాగిన్ ఐడి ద్వారా వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు .

# ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **సీపీ అంబర్ కిషోర్ ఝా**

జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు.ఇప్పటివరకు నమోదైన కేసులు,పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీపీ మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న కేసుల దర్యాప్తులో ఎలాంటి రాజీ పడకుండా పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.2025 సంవత్సరానికి ముందు నమోదై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణ,అరెస్టులు, సాక్ష్యాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రాపర్టీ,బాడిలీ అఫెన్స్ కేసుల దర్యాప్తును పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని తెలిపారు.గ్రేవ్ కేసుల పురోగతిని డీసీపీలు, అదనపు డీసీపీలు వారానికి ఒకసారి సమీక్షించాలని ఆదేశించారు.

ఆర్థిక నేరాల కేసుల్లో చట్టప్రకారం నిందితులకు సంబంధించిన ఆస్తులను జప్తు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. కిడ్నాపింగ్,మిస్సింగ్ కేసుల్లో బాధితులను గుర్తించడంలో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని,అలాంటి కేసుల్లో ఆలస్యం ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని దెబ్బతీసే అవకాశం ఉందన్నారు.ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను గౌరవ న్యాయస్థానం అనుమతితో త్వరితగతిన నిర్వీర్యం చేయాలని సూచించారు.సైబర్ క్రైమ్,ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులు ఉన్నట్లయితే వారిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, కన్విక్షన్ శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాల్లో భాగంగా అక్రమ ఇసుక రవాణా, గుడుంబా తయారీ, పేకాట తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి,వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని, ప్రజల నుంచి నేరుగా అందే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని



ఆదేశించారు.సీపీ కార్యాలయం ద్వారా వచ్చే ఫిర్యాదులపై కూడా వేగంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులను సహించేది లేదని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, విధి నిర్వహణలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. కార్యాలయాలు,విధి నిర్వహణ ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా ఎవరికీ అనుమతి ఇవ్వవద్దని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,సీఐలు, ఇన్‌స్పెక్టర్లు,ఎస్ఐలు పాల్గొన్నారు.

## జిల్లాలో ఫిష్ మార్కెట్, ఫిషరీ యూనిట్లు ఏర్పాటు చేయాలి

- **మంత్రి వాకిటి శ్రీహరికి విన్నవించిన గరిగే సుమన్.**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 30/అక్షరం న్యూస్ -:

జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న ముదిరాజుల జీవనోపాధి కొరకు జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంతో పాటు మందమర్రిలో ఫిష్ మార్కెట్ తోపాటు ఫిషరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా యువజన అధ్యక్షుడు గరిగే సుమన్ కోరారు. గురువారం హైదరాబాద్ లో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖలు, క్రీడలు, యువజన సేవలు శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి, పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ, జిల్లాలో నివసిస్తున్న ముదిరాజ్ లు తమ జీవనోపాధి కొరకు కులవృత్తి అయిన చేపల పట్టి, వాటిని అమ్మి, వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని, జిల్లాలో చాలా కుటుంబాలు చేపల వృత్తి మీదనే జీవిస్తున్నాయని తెలిపారు. జిల్లాలో సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దీనిపైన జీవిస్తున్న ముదిరాజ్ కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ముదిరాజ్ ల ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి కొరకు మంచిర్యాల, మందమర్రి ప్రాంతాలలో ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

## మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా. ఆసుపత్రి ఆవరణలో అన్నదానం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర హాజ్ కమిటీ సభ్యుడు సనా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది నిరుపేదలు, రోగుల సహాయకులు, ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు భోజనాలు అందజేశారు.ఈ సందర్భంగా సనా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జిధుల సారంగపాణి, 59వ డివిజన్ అధ్యక్షుడు రియాజ్, షాహిద్, అజర్, మజహర్, రవి, కృష్ణతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు

## మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా. ఆసుపత్రి ఆవరణలో అన్నదానం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర హాజ్ కమిటీ సభ్యుడు సనా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది నిరుపేదలు, రోగుల సహాయకులు, ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు భోజనాలు అందజేశారు.ఈ సందర్భంగా సనా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జిధుల సారంగపాణి, 59వ డివిజన్ అధ్యక్షుడు రియాజ్, షాహిద్, అజర్, మజహర్, రవి, కృష్ణతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్




జ్యోతి నగర్ ఎన్టిపిసి, మే 30: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖనిలోని ఎన్టీపీసీ సెంటర్, 8వ కాలనీ షిర్కే బస్టాండ్ కూడలి తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో ఇంధన ధరలు తగ్గకపోవడం అన్యాయమన్నారు. పెరిగిన ఇంధన ధరల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెంచిన ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పార్టీ పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, భూసనవేణి కృష్ణ, ఈసంపల్లి రాజేందర్, మార్త రాములు, చిలుక రాజు, కలువల రాయమల్లు, తూళ్ల శంకర్, బుషిపాక దేవయ్య, మాటేటి పోషం, రవి, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టిపిసి ప్లాంట్ లేబర్ గేటు వద్ద సిఐటియు 56 వ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

56వ సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎన్టిపిసి ప్లాంట్ గేట్ 2 కమాన్ వద్ద సిఐటియు అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లో సిఐటియు జెండాను యూనియన్ అధ్యక్షుడు ఎండి యాకూబ్ ఆవిష్కరించారు.అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గానికి హక్కులు, సౌకర్యాల కోసం సి ఐ టి యు ఎనలేని కృషి చేస్తున్నదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్య పోరాటాల ద్వారా ఎన్నో కార్మిక ఉద్యమాలు నిర్మించిన ఘనత సీఐటీయూ యూనియన్ కు ఉందని, దేశంలో సిఐటియు కార్మిక సంఘాన్ని స్థాపించి కార్మికుల ఉద్యమంలో ముందుభాగాన పోరాడుతూ ఈరోజు 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు.అలాగే ఎన్టిపిసి యాజమాన్యం పోలీసు వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ల పేరుతో కార్మికులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నదని, కొత్త కొత్త సర్కిలర్లు విడుదల చేస్తూ, కార్మికులను భయాందోళనలకు గురి చేస్తున్నదని, యాజమాన్యం ఇలాంటి విధానాలను మరియు పివిసి అమలు చేయాలని జారీ చేసిన సర్కులర్ ను తక్షణమే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు దండ రాఘవరెడ్డి, కాదాసీ మల్లేష్,కే రాజ్ కుమార్,తోట రవీందర్, ఏ రమేష్,ఎండి షమీం, ఏ చంద్రమౌళి, డి రాజయ్య, గణపతి, విజయ్, లెక్కల దేవేందర్ రెడ్డి, రామస్వామి, ఉమర్, కనకయ్య, రహమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ములుకనూరు సంఘంలో ఉద్యోగులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ మే 30/అక్షరం న్యూస్:–

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరు సంఘ హెడ్ ఆఫీస్ ఆవరణలో శనివారం శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి హనుమకొండ ఆధ్వర్యంలో సంఘ ఉద్యోగుల కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణురాలు డా. మౌనిక ఆధ్వర్యంలో 103 మంది సంఘ ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించి. కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఉద్యోగుల కంటి సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి తగిన వైద్య సూచనలు అందించారు. అలాగే కంటి సంరక్షణకు సంబంధించిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా ములుకనూరు సంఘ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి మరింత వేగంగా సాగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు.కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ ఎం. రాం రెడ్డి, సంఘ కార్యవర్గ సభ్యులు, శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది, సంఘ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థలో ఘనంగా పదవీ విరమణ వేడుకలు



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ మే 30/ అక్షరం న్యూస్ –:

సింగరేణి సంస్థ మందమర్రి ఏరియాలో సుదీర్ఘకాలం సేవలందించి శనివారం పదవీ విరమణ పొందిన డిప్యూటీ ఎస్.ఎస్.ఓ (సర్వే) ఎ. ప్రసాద్ రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ (స్పెషల్ గ్రేడ్) శ్రీమతి ఎం.ఎస్. అనంత లక్ష్మి ల పదవీ విరమణ మహోత్సవం మందమర్రిలోని 'ఇల్లందు క్లబ్'లో అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ హాజరై, పదవీ విరమణ చేసిన ఉద్యోగులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సంస్థకు వారు చేసిన అమూల్యమైన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. వారి శేష జీవితం ఆరోగ్యంగా, సంతోషంగా సాగాలని జీఎం ఆకాంక్షించారు. ఈ వేడుకలో ఎస్.ఓ.టూ జి ఎం జి.ఎల్. ప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) సిహెచ్.అశోక్, జీఎం కార్యాలయ సిబ్బంది మరియు ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సహోద్యోగులు పదవీ విరమణ పొందిన వారికి ఘన వీడ్కోలు పలికారు.

## మంత్రి శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ..



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రివర్యులు గౌరవ శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం స్థానిక గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, మారేల్లి రాజిరెడ్డి కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక కార్పొరేటర్ ధూళికట్ట సతీష్ మాట్లాడుతూ, "ప్రజా సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, సమాచార సాంకేతిక రంగాల విస్తరణలో శ్రీధర్ బాబు రాష్ట్రానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్ మాట్లాడుతూ, "శ్రీధర్ బాబు ప్రజల మనిషిగా, అంకితభావం కలిగిన నాయకుడిగా రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, "రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, ఐటీ రంగ విస్తరణలో శ్రీధర్ బాబు సేవలు చిరస్మరణీయమైనవి. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి మరిన్ని విజయాలు అందించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

## వరద ముప్పు నివారించడానికి కాలువల్లో పూడిక తొలగిస్తున్నాం ..

- **నగర మేయర్ మహంకాళి స్వామి**



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన పూడిక తొలగించి వరద ముప్పు నివారిశీచడానికి చర్యలు తీసుకుంటున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం ఒకటవ డివిజన్ లో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ జె, అరుణ శ్రీ తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సంధర్భంగా స్థానిక నాయకులు మడిపెల్లి మల్లేష్ వారికి స్వాగతం పలికి కాలనీ సమస్యలను ప్రత్యక్షంగా చూయించారు. మేయర్ ఆదేశాలతో జె సి బి , బ్లేడ్ ట్రాక్టర్ , చైన్ జె సిబి , బాబ్ కార్ట్ , జెట్టిశీగ్ యంత్రం , పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో పి కె. రామయ్య కాలనీ పట్టణ ప్రకృతి వనం ప్రక్కన ఉన్న వీధుల్లో పూడుక పోయి ఉన్న ఉపరి తల కాలువను పూర్తిగా శుభ్రం చేయించారు. తుప్పలు , పొదలు , పిచ్చి చెట్లు పెరిగి చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు వచ్చి నడవడానికి కూడా వీల్లేకుండా ఉన్న వీధుల్లో బ్లేడ్ యంత్రం సహాయంతో వాటిని తొలగించారు . దీంతో దారులు విశాలంగా మారాయి . పట్టణ ప్రకృతి వనంలో పెరిగిన పిచ్చి చెట్లను కూడా తొలగించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూగర్భ జలాలు పెరగడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ఎక్కువ సంఖ్యలో నిర్మించవలసియున్న దృష్ట్యా ఈ స్థలంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు గుంతలు తీసి సిద్ధం చేశారు. కార్యక్రమం అనంతరం మేయర్ మాట్లాడుతూ కాలనీ ఏర్పడిన నాటి నుండి కూడా కాలువల్లో పూడిక తీసిన ఆనవాళ్ళు లేవని అన్నారు. ఎం ఎల్ ఎ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో పూడిక తొలగించడానికి అవసరమైన పక్షంలో ఒకటవ డివిజన్ లోనే మరికొన్ని రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడతామని అన్నారు. గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పి కె రామయ్య కాలనీలో ఎశీ . ఎల్ ఎ చొరవతో రహదారులు విశాలంగా నిర్మించడం జరిగిందని అన్నారు. యు జి డి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మిగిలిపోయిన యు జి డి , రోడ్లను కూడా డి ఎం ఎఫ్ టి , ఎన్ టి పి సి సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్పెషల్ డ్రైవ్ లో మునిసిపల్ సిబ్బంది చాలా బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు.డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాలువల్లో నిలిచిపోయిన పూడిక తొలగింపు ఇప్పుడు జరుగుతున్నదని అన్నారు. ఎం ఎల్ ఎ కృషి తో అభివృద్ధి చురుగ్గా జరుగుతున్నదని అన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఋతుపవన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వర్షాకాలం రాకముందే కాలువల్లో పూడిక తొలగించే పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. వరద ప్రభావం ఉండే మురుగునీటి కాలువలలో పూడిక తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత మెరుగుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంగళ బాపు , నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర , డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎ ఇ తేజస్విని , సానిటరి ఇన్స్పెక్టర్ సంపత్ , సీనియర్ అకౌంటెంట్ రాజ్ కుమార్ , జవాన్ సూర్య , నగర పాలక సంస్థ సిబ్బంది , మెప్మా ఆర్ పి లు పాల్గొన్నారు.

## బీజేపి నాయకుల్లరా.. ఖబడ్దార్.. ప్రభుత్వాన్ని విమర్శిస్తే.. ఇళ్లను ముట్టడిస్తాం

- **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు**



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్), మే 30: రైతుల సంక్షేమం కోసం అంకిత భావంతో అహర్నిషలు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును విమర్శించే నైతిక హక్కు రైతులకు మద్దతు ఇవ్వని బీజేపి నాయకులకు లేదని, రైతులపై రాజకీయం చేయడానికి అటు రాష్ట్ర ప్రభుత్వాన్ని.. ఇటు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని అభాసుపాలు చేయడానికి ప్రయత్నిస్తూ..నీచ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపి నాయకులకు సిగ్గు..శారం లేదని.. బీజేపి నాయకుల్లరా.. ఖబడ్దార్ అంటూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మారజోడు రాంబాబు మాట్లాడుతూ రైతన్నల సంక్షేమంకోసం అంకిత భావంతో పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్థం.. పర్థం లేని విమర్శలకు పాల్పడుతున్న బీజేపి నాయకుల తీరు... వారి దివాళకోరుతనానికి నిదర్శనంగా నిలుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. దేశంలోని 29 రాష్ట్రాలతో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వమే పూర్తి భాధ్యతతో వ్యవహరిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు, ధాన్యం మిల్లులకు తరలింపులో జరుగుతున్న జాప్యంను అధిగమించడానికి తహసీల్దార్, సిఐ, ఎస్ఐ, ఐకేపి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వారం రోజులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఒక్క ధాన్యం బస్తా లేకుండా మిల్లులకు తరలించడానికి సత్వర చర్యలు తీసుకునేటట్లు, అలాగే అకాలవర్షం వస్తే తడిసిన ధాన్యంను సైతం ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేటట్లు సత్వర చర్యలు తీసుకునే విధంగా అధికారులతో మాట్లాడడం జరిగిందని, రైతులు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు గత యాసంగి సీజన్లో 1.20 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం దిగుబడి రాగా, ఈ యాసంగి సీజన్లో 2.45 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం దిగుబడి వచ్చిందని, ఇప్పటికే 1.54 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యంను కొనుగోలు చేసి మిల్లులకు తరలించారని, మిగతా 91 వేల క్వింటాళ్లను వారం రోజుల్లో మిల్లులకు తరలించేటట్లు అధికారులతో మాట్లాడి ఒప్పించడం జరిగిందన్నారు.బీజేపి నాయకులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి విమర్శించడం మానుకోని... రైతుల ఇబ్బందులను తీర్చలనే ఆలోచన ఏమాత్రం ఉన్న రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపి ఎంపీలు, అందులోని ఇద్దరు కేంద్ర మంత్రుల ద్వారా ధాన్యం కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం సహకరించేటట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పై ఒత్తిడి తీసుకరావడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా నాయకులు మేకల నరేందర్. నామాల బుచ్చయ్య, గాదె మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి, ఇబ్రహీం పాష, గుగులోతు కొంరెల్లి, ఎండి. అబ్బాస్ మియా, బెజ్జం వెంకటరెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండేలగూడెం సర్పంచ్ ద్యాగల రాజశేఖర్, ఉప సర్పంచ్ బొనాసి కొంరయ్య, మినుముల వెంకట రెడ్డి, కడారి రవి. కావటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## బత్తుల లక్ష్మమ్మకు నివాళులర్పించిన డాక్టర్ సెల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా మురళీకృష్ణ



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 వైరా (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీకి చెందిన కార్మికురాలు అరుణ మాతృమూర్తి బత్తుల లక్ష్మమ్మ వడదెబ్బతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్స్ సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ కార్మికురాలు అరుణ మాతృమూర్తి శ్రీమతి బత్తుల లక్ష్మమ్మ వడదెబ్బ కారణంగా మృతి చెందిన విషయం ఎంతో బాధాకరం అన్నారు. ఆమె భౌతిక కాయానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తోటకూర శ్రీకాంత్, ఒరుకు శ్రీను, తదితరులు ఉన్నారు.




## ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగికి ఘన సన్మానం

రామగిరి (పెద్దపెల్లి జిల్లా) మే 30 అక్షరం న్యూస్:

ఆర్జీ 3 జి.ఎం.కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా శనివారం ఉద్యోగ విరమణ పొందిన జిఎం కార్యాలయం నందు డిప్యూటీ సూపరిండెంట్ ( పి.ఏ.టు జి.యం) గా విధులు నిర్వహిస్తున్న ఎలిశెట్టి విశ్వేశ్వర్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, తోపాటు అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సుమారు 37 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేసి సంస్థ పట్ల విధేయతతో, అంకిత భావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ఇంచార్జ్ ఎస్వో టుజియం పి.రాజారెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, విభాగధిపతులు బి.టి.మురళీ కృష్ణ, రాజేంద్ర కుమార్, ఐలయ్య , అప్సర్ భాష, ఆర్.రాజేశ్వరి, రవి చరణ్, శ్రీ హర్ష, తోపాటు ఇతర విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రామగుండం ఎన్టీపీసీలో 1900 మెగావాట్ల ఉత్పత్తి నిలిపివేత...



- **డిమాండ్ తగ్గడంతో ఐదు యూనిట్లు షట్‌డౌన్**

జ్యోతినగర్ ఎన్ టి పి సి మే 30 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:


ఎన్టీపీసీ రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లో విద్యుత్ డిమాండ్ తగ్గిపోవడంతో ఈ నెలలో రెండవసారిభారీ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. శనివారం నుంచి మొత్తం 1900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినట్లు సమాచారం.ప్లాంట్‌లోని 200 మెగావాట్ల రెండో, మూడో యూనిట్లతో పాటు 500 మెగావాట్ల నాలుగో, ఐదో, ఏడో యూనిట్లను షట్‌డౌన్ చేశారు. దీంతో 2600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగిన రామగుండం ఎన్టీపీసీలో ప్రస్తుతం కేవలం 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కొనసాగుతోంది.ప్రస్తుతం 200 మెగావాట్ల మొదటి యూనిట్, 500 మెగావాట్ల ఆరవ యూనిట్ మాత్రమే పనిచేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు 1600 మెగావాట్ల సామర్థ్యం గల తెలంగాణ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లోని రెండు 800 మెగావాట్ల యూనిట్లను కూడా పూర్తి సామర్థ్యంతో కాకుండా సగం లోడ్‌తోనే నడుపుతున్నారు.ఇటీవల నెలలుగా విద్యుత్ డిమాండ్‌లో మార్పులు, సౌర విద్యుత్ ఉత్పత్తి పెరుగుదల కారణంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తరచూ తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత నాలుగు నెలలుగా ప్రతి నెల కొన్ని రోజుల పాటు యూనిట్లను నిలిపివేస్తుండగా, తాజాగా ఐదు యూనిట్ల షట్‌డౌన్‌తో రామగుండం ఎన్టీపీసీలో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఈ పరిణామాలు ఉద్యోగులు, కార్మిక వర్గాల్లో

### మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణను ఛాలెంజ్ తీసుకోవాలని...

## పోలీస్ అధికారులను ఆదేశించిన..రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30 (అక్షరం న్యూస్)

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ అన్నారు.పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్ లో డీజీపీ మాట్లాడుతూ...మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణను ఛాలెంజ్ తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితులలో మాదకద్రవ్యాలను వినియోగం కట్టడి చేయకుంటే యువత భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు.జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలో విద్యార్థుల అలవాట్లను పర్యవేక్షించాలని, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల సరఫరా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, వాటి నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సాధారణ దొంగతనం కేసుల కంటే సైబర్ నేరాలు చాలా వేగంగా పెరుగుతున్నాయని,. సమాజంలో మారుతున్న సాంకేతికతను వాడుకుంటూ సైబర్ నేరగాళ్ళు వేల కోట్లు దోచుకుంటున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్ని ప్రజలను చైతన్యం పరచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, ప్రాణ నష్టాన్ని తగ్గించడానికి రహదారి భద్రతను మెరుగుపరచడానికి, వాహనాల రాకపోకలను సులభతరం చేయడానికి ట్రాఫిక్ మేనేజ్ మెంట్ ఖచ్చితమైన అమలు చేయాలన్నారు.మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ లైంగిక వేధింపులు, గృహహింస, సైబర్ నేరాలు వంటి సమస్యలను అరికట్టడానికి షీ టీమ్స్ భరోసా కేంద్రాలు వంటి ప్రత్యేక విభాగాలు నిరంతరం పనిచేయాలని అన్నారు.విజిబుల్ పోలీసింగ్ ద్వారా రాత్రి వేళల్లో గస్తీ, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, విస్తృత




వాహన తనిఖీలు చేపట్టాలన్నారు.సమాజంలో శాంతిభద్రతలను కాపాడే పోలీసు వ్యవస్థకు పారదర్శకత అనేది అత్యంత ప్రాముఖ్యమైనదని, ఇది వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందిస్తుందన్నారు.నేర రహిత సమాజం, కఠినమైన చట్టాల అమలు కోసం పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండటం అవసరమని అన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలు అంశాలపై వివరించారు.

## కాంట్రాక్టు కార్మికులకు పీవీసీ తప్పనిసరి నిబంధన ఉపసంహరించుకోవాలి

- **జేఏసీ**

జ్యోతినగర్, మే 30: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ (ౡఎజ) తప్పనిసరి చేస్తూ ఇటీవల జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది.జేఏసీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, ఎన్టీపీసీ రామగుండం ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ కార్యకలాపాల్లో వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు కీలక పాత్ర పోషిస్తూ రాత్రింబగళు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అయితే గత కొంతకాలంగా గేట్ పాస్‌ల జారీకి పీవీసీని తప్పనిసరి చేస్తూ కార్మికులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అంశంపై గతంలోనే జేఏసీ ఆధ్వర్యంలో యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించగా, సానుకూలంగా స్పందించిన యాజమాన్యం 15 రోజుల కాలపరిమితితో తాత్కాలిక గేట్ పాస్‌లు జారీ చేస్తూ వచ్చిందని గుర్తుచేశారు. అయితే ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మే 29న హెచ్‌ఆర్ విభాగం ద్వారా మళ్లీ పీవీసీ తప్పనిసరి చేస్తూ కొత్త సర్క్యులర్ విడుదల చేయడం కార్మికుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసిందన్నారు.పీవీసీ పొందే ప్రక్రియలో సాంకేతిక, పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నందున అనేక మంది కార్మికుల ఉపాధిపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం కారణంగా వేలాది మంది కార్మికులు అయోమయం, మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు.ఆకస్మికంగా జారీ చేసిన ఈ సర్క్యులర్ వల్ల ప్లాంట్‌లో పారిశ్రామిక అశాంతి నెలకొనే అవకాశం ఉందని హెచ్చరించిన జేఏసీ, కార్మికుల ప్రయోజనాలు మరియు ప్లాంట్‌లో ప్రశాంత వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని పీవీసీ నిబంధనను తక్షణమే రద్దు చేయాలని యాజమాన్యాన్ని కోరింది. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిలుక శంకర్ నాంసాని శంకర్ జి లక్ష్మారెడ్డి రాజ మల్లయ్య సత్యం భూషణం తదితరులు పాల్గొన్నారు.



### లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ

## సేవలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు

- **క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్‌కు ప్రతిష్టాత్మక "మెల్విన్ జోన్స్ మెడల్" ప్రదానం**

రామగిరి, పెద్దపల్లి జిల్లా, మే 30 (అక్షరం న్యూస్):

సమాజ సేవలో విశేష కృషి చేస్తూ ముందంజలో కొనసాగుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీకి మరో అరుదైన గౌరవం దక్కింది. క్లబ్ అధ్యక్షులు లయన్ మేకల మారుతి యాదవ్‌కు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ పేరుతో అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన "మెల్విన్ జోన్స్ మెడల్"ను లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ ఘట్టమనేని బాబురావు ఘనంగా ప్రదానం చేశారు. శనివారం పెద్దపెల్లి జిల్లాలోని సుల్తానాబాద్‌లోని ఫోటో ఫామ్ రిసార్ట్‌లో జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన లయన్స్ కుటుంబ ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ ఘట్టమనేని బాబురావు, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు.క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు, నిత్యావసర సరుకుల పంపిణీ, కంటి ఆపరేషన్లు, నేత్రదాన అవగాహన కార్యక్రమాలు, నేత్రాల సేకరణ వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, పీఎస్టీ మరియు డైరెక్టర్లు డా. శరణ్య యాదవ్, గంట వెంకటరమణ రెడ్డి, టీవీ సురేష్ బాబు, బుదర్తి బుచ్చయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



అనంతరం క్లబ్‌లో సేవా కార్యక్రమాలతో పాటు నూతన సభ్యుల నమోదులో విశేషంగా కృషి చేసిన అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ మెల్విన్ జోన్స్ మెడల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ, తమ క్లబ్ సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందించిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్ పర్సన్ ఘట్టమనేని బాబురావు, జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాములు మరియు జిల్లా నాయకత్వానికి క్లబ్ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం క్లబ్‌లోని ప్రతి సభ్యుని సేవా తపనకు దక్కిన గుర్తింపని పేర్కొన్నారు."సేవే లక్ష్యం... సమాజమే కుటుంబం" అనే నినాదంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు.





## వాయిదాలకు గైర్హాజరు.. నలుగురిని జైలుకు తరలింపు

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/మే 30/అక్షరం న్యూస్:-

కోర్టు విధించిన వాయిదాలకు పలుమార్లు గైర్హాజరైన నలుగురు వ్యక్తులను కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు.హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల రవీందర్, వేల్పుల వెంకటేష్, చల్లూరి భాస్కర్‌తో పాటు కొప్పూరు గ్రామానికి చెందిన గద్ద రామరాజు కోర్టు వాయిదాలకు నిర్ణీత సమయంలో హాజరుకాకపోవడంతో సంబంధిత కేసులను విచారించిన న్యాయమూర్తి ప్రతీక్ సింగ్ ఆదేశాల మేరకు వారిని హుజూరాబాద్ జైలుకు పంపించినట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ కోర్టు కేసులు ఉన్న వ్యక్తులు తమకు కేటాయించిన వాయిదాల తేదీల్లో తప్పనిసరిగా కోర్టుకు హాజరుకావాలని సూచించారు. కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం వల్ల చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ కేసుల పురోగతిపై అప్రమత్తంగా ఉండి కోర్టు నిబంధనలను పాటించాలని కోరారు.



# ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలి

- అధికారులతో సమీక్ష..
- జిల్లా చైర్మన్ మారుజోడు రాంబాబు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) మే 30 :

మండలంలోప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ధాన్యాన్ని త్వరితగతిన తరలించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచనల మేరకు శనివారం రఘునాథపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, సీఐ, ఎస్ఐ, ఐకేపీ అధికారులు, లారీ కాంట్రాక్టర్లతో రాంబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిల్వలు, తరలింపు ప్రక్రియ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రైతులు తమ పంటను విక్రయించిన అనంతరం ఎలాంటి ఆలస్యం లేకుండా ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న కొనుగోళ్లను వారం రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈసమావేశంలో తహసీల్దార్ రాజేష్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ నరేష్, ఐకేపీ ఏపీఎం, సీసీలు ఎల్లాస్వామి, సరోజన, లారీ కాంట్రాక్టర్లు, నాయకులు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి, కోళ్ల రవి గౌడ్, నామాల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడెం గ్రామం లో సీసీ కెమెరాలు ప్రారంభించిన డి ఎస్ పి



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -30(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన 30 సీసీ కెమెరాలను సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి రూరల్ సీఐ నాగేశ్వరరావు సర్పంచ్ తాటిపల్లి శంకర్ పాలకవర్గ సభ్యులు ప్రజా ప్రతినిధులు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ గూడెం గ్రామస్తులు గ్రామంలో శాంతిభద్రతలు దొంగతనాలు దోపిడీలు అరాచకాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు ఈ రోజుల్లో సంఘవిద్రోహకులు చేస్తున్న అరాచకాలు ప్రత్యక్షంగా చూసినా ప్రజలు భయాందోళన గురి అయ్యే ఇతరత్రా కారణాలవల్ల సాక్ష్యం చెప్పలేకపోతున్నారని సీసీ కెమెరాలు వల్ల ఎంతో లాభదాయకమని నిందితులను గుర్తించుటలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు ఈ సందర్భంగా గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామము పూర్తిగా రక్షణ వలయంలో ఉంటుందని దోపిడీలు దొంగతనాలు చేయడానికి కూడా భయాందోళనలు ఉంటాయన్న అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటిపల్లి శంకర్ పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు అంజన్ రావు, శ్రీధర్, బొప్ప నర్సయ్య, కుర్ర సావిత్రి, గిరి,చాడ శ్రీనివాస్ అమ్మ ఫౌండేషన్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

# జిల్లా ఎస్పీ ని సన్మానించిన బీ ఆర్ ఎస్ నాయకులు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -30(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ చేతుల మీదుగా సీసీ కెమెరాలు ప్రారంభించిన సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో ఎస్పీ, ని ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భోంపెల్లి సురేందర్ రావు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చేవుల మల్లేశం యాదవ్, కొండ శ్రీనివాస్ గౌడ్ లు శాలువ తో సన్మానించారు

ఈ కార్యక్రమంలో టి ఎస్ పీ ఎస్ సి మాజీ సభ్యులు డాక్టర్ ఎర్రవెల్లి చంద్రశేఖర్ రావు డాక్టర్ శంకర్ , సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, డాక్టర్ రాజారామ్ వివిధ గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు

# నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం....

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలి...
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -30(అక్షరం న్యూస్ )

ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు శనివారం రోజున ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 101 సీసీ కెమెరాల ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ కెమెరాలు ప్రారంభించారు.

ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...

నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఒక్క సీసీ కెమెరా100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన నిందితులను త్వరితగతిన గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసు శాఖ ముందంజలో సాగుతోందని తెలిపారు.సీసీ కెమెరాలు, డిజిటల్ నిఘా వ్యవస్థలు,ఆధునిక దర్యాప్తు పద్ధతుల ద్వారా నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతోందన్నారు. ప్రజలు, వ్యాపారస్థులు, ప్రజాప్రతినిధులు స్వచ్చందగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని,తద్వారా పట్టణాల్లో , గ్రామాల్లో సంచరించే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం,నేరాలకు పాల్పడిన వ్యక్తులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు.ప్రజల భాగస్వామ్యంతోనే సమాజంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయన్నారు.



ముస్తా బాద్ మండలం తో పాటుగా గ్రామాల్లో స్వచ్ఛందగా ముందుకు వచ్చి 101 సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ధాతలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ నాగేశ్వరరావు, ఎస్.ఐ గణేష్ ,ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు ,వివిధ రాజకీయ పార్టీల నాయకులు సన్ రైస్ సీసీ కెమెరాల కంపెనీ సభ్యులు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ముస్తాబాద్ మండలం లో 5ప్రీ-ప్రైమరీ తరగతులు మంజూరు!

- మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -30(అక్షరం న్యూస్ )

2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రీ ప్రైమరీ (ఎల్కేజీ,యూకేజీ)తరగతులను నిర్వహించుటకు ముస్తాబాద్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 1.ముస్తాబాదు ప్రైమరీ 2.ఛీకోడ్ 3.గూడెం 4.వెంకట్ రావు పల్లి , 5.నామాపుర్ లకు ప్రభుత్వం అనుమతులను మంజూరు చేయడం జరిగిందని ముస్తాబాద్ మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణ కొరకు శిక్షణ పొందినఉపాధ్యాయులు, ఆంగ్ల మాధ్యమంలో బోధన కొరకు ఒక టీచర్ ను, ఆయాను ప్రభుత్వం నుండి నియమించడం జరుగుతుందని, అలాగే ప్రీ-ప్రైమరీ (ఎల్కేజీ,యూకేజీ)తరగతుల నిర్వహణ కొరకు లక్ష రూపాయల గ్రాంట్ తో వర్క్ బుక్కులు,యూనిఫామ్స్, ఆట వస్తువులు, కార్పెట్లు,ఫర్నిచర్,రీడింగ్ చైర్స్, తరగతి గది గోడలపైలి ఆకర్షణీమైనా బొమ్మల చిత్రీకరణ కొరకు కేటాయించబడుతుందని తెలియజేశారు.అలాగే ఈ విద్యా సంవత్సరం విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం తో పాటు అల్పాహారం అందించబడుతుందని, కావున తల్లిదండ్రులు 3 నుండి 5 సంవత్సరాల వయసుగల తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించి, ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల మండల విద్యాధికారి తల్లిదండ్రులను కోరారు.

# గణిత శాస్త్ర బోధకులు రామారావు మృతి సంతాపం తెలిపిన గుండాల కృష్ణ.



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 30( అక్షరం న్యూస్)

ప్రముఖ గణిత శాస్త్ర బోధకులు, ఉత్తమ అవార్డు గ్రహీత బసవరాజు వెంకట రామారావు శనివారం మృతి చెందారు.ఎంతో మంది విద్యార్థులను ఆయన బోధన తో ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేశారు.కాగా ఆయన మరణ వార్త తెలియగానే ఎస్.బి. ఐ.టి., ఆర్జే సి విద్యా సంస్థల అధినేత గుండాల కృష్ణ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన మరణం జిల్లా విద్యా రంగానికి తీరని లోటని కొనియాడారు.

# బాలంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఎన్నిక



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)మే 30:

మండలంలోని కోమల్ల బాలంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతల నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొల్లపల్లి (ఎర్ర) కుమారస్వామి, పెద్దగోని మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శిగా వల్లాల రాజు, సహాయ కార్యదర్శిగా వెలిశాల రవి, భక్తి ప్రచారకార్యదర్శిగా బానోతు చందర్, గౌరవ సలహాదారులుగా బాల్నే వెంకటయ్య. తాటికొండ వెంకటేష్ యాదవ్, మంకెన అన్నపు రెడ్డి, బండి యాదగిరి, ముప్పిడి అనిల్, కార్యవర్గ సభ్యులుగా బండి సాంబరాజు, మైలారం నరేష్, సుల్తాన్ రాజశేఖర్ రెడ్డి, కొరిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. కోశాదికారిగా పాసికంటి ఉపేందర్ లు ఎన్నికయ్యారు

# గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు -ఎస్సై గణేష్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -30(అక్షరం న్యూస్ )

మాదక ద్రవ్యాలు (డ్రగ్స్, గంజాయి), ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడానికి పోలీసులు ప్రత్యేక శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్స్ (నార్కోటిక్ జాగిలాలు) సహాయంతో ముస్తాబాద్ మండల కేంద్రం లోని వాణిజ్య సముదయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారుముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్కోటిక్ టీమ్ సమన్వయంతో నార్కోటిక్ స్నిఫర్ డాగ్ స్క్వాడ్ సహకారంతో ముస్తాబాద్ పాత బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటళ్లు, పాన్ షాపులు, అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు, చిన్నపిల్లలకు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు, గుట్కా, సిగరెట్లు వంటి నిషేధిత వస్తువులు విక్రయించిన పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని ఎస్సై గణేష్ సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్సై తెలిపారు. ఈ తనిఖీలలో యాంటీ నార్కోటిక్ వింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# అన్నదాతకు వెన్నుపోటుగా ఉన్నది వరి మద్దతు ధర

- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్.



యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట / అక్షరం న్యూస్ : మే 30 - :

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వరి మద్దతు ధరను తక్షణమే ఉపసంహరించుకొని 3500 గా ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ డిమాండ్ చేశారు . ఆత్మకూరు మండలంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎంఎస్పి మద్దతు ధరల పత్రాలను దగ్ధం చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో ఒక కోటి 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండిస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం 53 లక్షలు మాత్రమే కొనుగోలు చేస్తామనడం ప్రైవేట్ దళారి దోపిడీ ప్రోత్సహించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తపరిచారు.. కొనుగోలు వ్యవస్థ లేకపోవడం వల్ల వాస్తవ నష్టాలు దీనికి అనేక రేట్లు ఎక్కువగా ఉన్నాయి .ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ఎరువుల ఫర్టిలైజర్ల ధరలు పెంచి మరోవైపు నామమాత్రపు మద్దతు లేకుండా చేయడం దారుణం అన్నారు. తక్షణమే రైతులకు 3500 మద్దతు ధర ప్రకటించాలని లేనిచో దేశవ్యాప్తంగా 500 రైతు సంఘాలను ఐక్యం చేసి కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఆత్మకూరు మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ రెడ్డి రచ్చ గోవర్ధన్ వేముల బిక్షం రాస మల్ల సత్తయ్య మజ్జిగ రామ నరసయ్య జి స్వామి బి మల్లయ్య రాగిరి రాములమ్మ తవిటి లక్ష్మమ్మ కందడి సరోజన తదితరులు ఉన్నారు...

## యాదాద్రి భువనగిరి జిల్లా నుండి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీగా చేరికలు



యాదాద్రి భువనగిరి జిల్లా/యాదగిరిగుట్ట /అక్షరం న్యూస్ : మే 30 :

బుద్ధుల సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని నూతనంగా చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ మరియు రాష్ట్ర కార్యదర్శి పసల ప్రసన్న కుమారి ,యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల అధ్యక్షులుగా గడ్డం నరసింహ, రామన్నపేట మండల అధ్యక్షుడిగా కళ్ళెం ఉపేందర్ నియామకం జరిగింది.ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షులు మాట్లాడుతూ తమకు ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ,ఈ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్ ,గిరగాని బిక్షపతి గౌడ్,మండల అధ్యక్షురాలు రోజా రాణి,నాయకులు విజయ్ కుమార్, కొయ్యడ వెంకటేశం,రాజగోపాల్ రెడ్డి, రూపాని మహేష్, చెరుకు శేఖర్ ,పల్ల స్వామి, రూపాని రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు...



## దళితులపై వివక్ష చట్ట ప్రకారం నేరం

- దళిత సమస్యల పరిష్కారం కోసమే పౌర హక్కుల దినోత్సవం.
- డి వి ఎం సి సభ్యులు బర్రె సుదర్శన్.



యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట / అక్షరం న్యూస్ : మే 30 –: దళితులపై కుల వివక్ష, అంటరానితనం పాటిస్తే చట్ట ప్రకారం నేరమని, వారిపై కేసులు నమోదు చేస్తామని, దళితుల సమస్యల పరిష్కారం కోసమే ప్రతి నెలా చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ/ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్ అన్నారు. శనివారం భువనగిరి మండలం చీమల కొండూరు గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో జరిగిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భువనగిరి డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనం చట్టప్రకారం నేరమని, ఎవరైనా పాల్పడినా,ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థకు, బడి ఈడు పిల్లలు బడికి దూరమైనా బాలల హక్కులకు భంగం కలిగినట్లే అని అన్నారు. దళితుల సమస్యలు చదువు ద్వారానే పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు. సమావేశంలో గ్రామంలోని పలు సమస్యల పై చర్చించారు. ఈ సమావేశంలో భువనగిరి డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, పోలీస్ శాఖ(జందార్ ) వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ వడ్డే హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఈరబోయిన చంద్రయ్య, గ్రామ పాలన అధికారి బొట్ల రమేష్, హెల్త్ అధికారులు దివ్య, పుష్ప, అంగన్వాడీ టీచర్ రాజ్యలక్ష్మి, గ్రామస్తులు లక్ష్మీ నర్సయ్య, రమేష్, పాండు, దేవయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



### ధాన్యం కొనుగోళ్లు,మరియు ప్రజా సమస్యల పరిష్కారమే

## ధ్యేయంగా సాగిన... ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే సైకిల్ యాత్ర



యాదాద్రి భువనగిరి జిల్లా / యాదగిరిగుట్ట / అక్షరం న్యూస్ : మే 30 : యాదగిరిగుట్ట : మే 30 – : : యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి పాదాల నుండి తుర్కపల్లి మండల కేంద్రం వరకు17 కిలోమీటర్ల మేర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నాయకత్వంలో ధాన్యం కొనుగోళ్లు మరియు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సైకిల్ యాత్ర కొనసాగిందని తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డ్రిజిల్ ధరల పెంపును నిరసిస్తూ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైకిల్ యాత్ర సాగిందని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాదాల నుండి తుర్కపల్లి మండల హెడ్ క్వార్టర్ వరకు సైకిల్ యాత్ర నిర్వహించిన క్రమంలో మార్గమధ్యలో దత్తాయపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేసి లారీలు ఎప్పటికప్పుడు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కృష్ణా రెడ్డిని ఫోన్ ద్వారా ఆదేదించారు,అదేవిధంగా వెంకటాపూర్ గ్రామంలోని ప్రజలు తెలిపిన పలు సమస్యలపై స్పందిస్తూ అక్కడున్నటువంటి సమస్య మిషన్ భగీరథ వాటర్ పైప్ లైన్ లీకేజీలకు సంబంధించిన విషయాన్ని ఎమ్మెల్యేకు చెప్పడంతో వెంటనే పంచాయతీరాజ్ మినిస్టర్ సీతక్కకు ఫోన్ చేసి సమస్య వారం రోజుల్లో పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరడం జరిగింది. అలాగే తుర్కపల్లి మండలం లోని పిఎసిఎస్ సెంటర్లో వద్ద కొనుగోలు సంబంధించి అక్కడ రైతులను అడిగి తెలుసుకుని లారీల విషయంలో అన్లోడ్ ప్రాబ్లమ్ అవుతుందని చెప్పడంతో సంబంధిత అధికారులకు ఫోన్ చేసి జూన్ రెండో తారీకు లోపల ఆలేరు నియోజకవర్గంలో అన్ని సెంటర్లలో ఉన్నటు వంటి వడ్లు అన్ని లిఫ్ట్ చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. లేదంటే అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పి రైతులకు భరోసా ఇవ్వడం జరిగిందనీ వెంకటేష్ గౌడ్ తెలిపారు...


### పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు

## నిరసనగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సైకిల్ యాత్ర

- **జూన్ 2వ తేదీ నా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంటే అధికారులపై చర్యలు తప్పవు- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.**



యాదాద్రి భువనగిరి జిల్లా /యాదగిరిగుట్ట / అక్షరం న్యూస్ : మే 30 : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం నుండి తుర్కపల్లి మండల కేంద్రం వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సైకిల్ యాత్ర చేపట్టారు. ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారం తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సైకిల్ యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా యాదగిరిగుట్ట మండలం పరిధిలోని మల్లాపూర్, దత్తాయిపల్లి, వెంకటాపురం గ్రామాల మీదుగా తుర్కపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలు అధికంగా ఉండటం, లారీల సమస్య, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, జూన్ 2వ తేదీ వరకు ఏ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కనిపిస్తే అధికారుల పై చర్యలు తప్పవన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదేశించారు. వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని గోదాములకు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే హమాలీ కార్మికులను ఇతర ప్రాంతాల నుండి తుర్కపల్లి మండలానికి తరలించి ధాన్యం లోడింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం దత్తాయిపల్లి నుండి వెంకటాపురం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే గారు అక్కడ మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు నాలుగు నుండి ఐదు చోట్ల లీకేజీలు ఉన్న విషయాన్ని గుర్తించారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీమతి సీతక్క గారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా,వృధా అవుతున్న నీటిని అరికట్టేందుకు, వెంటనే మరమ్మతుల పనులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సీతక్కమీ తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అదేవిధంగా పర్యటన సందర్భంగా ప్రజలు తమ గ్రామాలలో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సైకిల్ యాత్రలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు...





### మల్లయిగూడెంలో పామాయిల్ తోట ధ్వంసం..

## బాధిత రైతును పరామర్శించిన మెచ్చా నాగేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం /

అశ్వారావుపేట / మే 30 / అక్షరం న్యూస్ –: అశ్వారావుపేట మండలం మల్లయిగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్‌కు చెందిన పామాయిల్ తోటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. తనకున్న ఐదు ఎకరాల పట్టా భూమిలో కష్టపడి పెంచుకుంటున్న పామాయిల్ మొక్కలను రాజకీయ కక్షతోనే రాత్రికి రాత్రే నరికివేశారని బాధితుడు ఆరోపించారు. ఈ ఘటనపై గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు శనివారం పార్టీ నాయకులతో కలిసి మల్లయిగూడెం గ్రామానికి చేరుకుని ధ్వంసమైన పామాయిల్ తోటను స్వయంగా పరిశీలించారు. పంట నష్టం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం బాధిత రైతు నారం రాజశేఖర్‌ను పరామర్శించి, పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికార మదంతో కొందరు నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది అభివృద్ధి పనులు చేయడానికి తప్ప ఇలాంటి విధ్వంసక చర్యలకు కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఎవరూ కూడా శాశ్వతంగా అధికారంలో ఉండరని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదని, ప్రస్తుతం నియోజకవర్గంలో దాడులు, విధ్వంస ఘటనలు పెరుగుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జూపల్లి రమణారావు, మోహన్ రెడ్డి, సంక ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, కిషోర్, ఈదర రాంబాబు, చందా కుమారస్వామి, దుర్గారావు, రాజారావు, శివకాంత్, అనిల్, హేమంత్, నరసింహారావు, సుధాకర్, సున్నం కృష్ణ, సంజయ్, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



## 15వ వార్డులో అతి తక్కువ వోల్టేజీతో ప్రజలకు ఇబ్బందులు

- సమస్య పరిష్కారానికి అధికారులను కలిసిన కౌన్సిలర్ మోర్ల రాజేశ్వరి.





భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేట / మే 30 / అక్షరం న్యూస్ –:

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో గల గౌడ్ బజార్, నాయి బ్రాహ్మణ బజార్ ప్రాంతాల్లో గత కొంతకాలంగా అతి తక్కువ వోల్టేజీ సమస్య నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో విద్యుత్ సరఫరా వోల్టేజీ తగ్గిపోవడంతో గృహోపకరణాలు సక్రమంగా పనిచేయకపోవడం, విద్యార్థుల చదువులకు అంతరాయం కలగడం, వ్యాపార కార్యకలాపాలు ప్రభావితమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మోర్ల రాజేశ్వరి దృష్టికి తీసుకురావడంతో ఆమె విద్యుత్ శాఖ ఏఈని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డికి వినతిపత్రం అందజేసి సమస్యను అత్యవసరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈని వివరణ కోరగా, సంబంధిత ప్రాంతంలో నెలకొన్న వోల్టేజీ సమస్యను పరిశీలించి అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టి మరికొద్ది రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు సహకరించాలి..

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.



పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్/ మే 30/ అక్షరం న్యూస్ –:

జనాభా గణన-2027లో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించి ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హౌస్ లిస్టింగ్ సర్వేలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని ఎన్యూమరేటర్‌కు అవసరమైన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. హౌస్ లిస్టింగ్ సర్వే జనాభా గణన-2027లో అత్యంత కీలకమైన దశ అని తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణం, గృహ సౌకర్యాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య సదుపాయాలు, విద్యుత్, వంట ఇంధనం, కమ్యూనికేషన్ సౌకర్యాలు తదితర వివరాలను ఈ సర్వే ద్వారా నమోదు చేస్తారని చెప్పారు. సర్వే ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సహకరించి సరైన వివరాలను అందించాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఈ సమాచారంతో సంక్షేమ పథకాలకు ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి అపోహలకు తావివ్వకుండా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులు నిబంధనల ప్రకారం ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేయాలని, సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

## మొయినాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన జెండా

# పండుగ ఘనంగా.. జెండా ఆవిష్కరించిన కల్వకుంట్ల కవిత

- ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరేలా కృషి చేస్తాం: కల్వకుంట్ల కవిత.
- రంగారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం: నీరుడు సర్వేష్ ముదిరాజ్.
- కార్యకర్తల భారీ హాజరుతో మొయినాబాద్‌లో రాజకీయ సందడి.



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :మే 30: అక్షరం న్యూస్–:

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మొయినాబాద్ మండలంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగ కార్యక్రమం రాజకీయంగా విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న అనంతరం పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మొయినాబాద్‌కు చేరుకుని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జెండా ఆవిష్కరణ సందర్భంగా నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహం వ్యక్తం చేయగా, మొయినాబాద్ ప్రాంతమంతా రాజకీయ సందడితో కళకళలాడింది.

కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం లక్ష్యాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, బలహీన వర్గాల అభ్యున్నతి, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. రాజకీయాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం తమ పార్టీ ముఖ్య లక్ష్యాలని స్పష్టం చేశారు.

రాబోయే రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసి ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి ఇంటి వద్ద తెలంగాణ రక్షణ సేన జెండా ఎగరేలా కృషి చేస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ రాజకీయాల కేంద్ర బిందువని పేర్కొంటూ, నిరుద్యోగం, రైతు సమస్యలు, మహిళల భద్రత, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధి కోసం పార్టీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోందని వివరించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేసే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలంగాణ రక్షణ సేన ఎదుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలలో కల్వకుంట్ల కవితకు పెరుగుతున్న ఆదరణను ప్రస్తావించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారని, భవిష్యత్తులో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఆమెను చూడాలని అన్ని వర్గాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లగల నాయకత్వం కవితదేనని, రాష్ట్ర అభివృద్ధికి ఆమె విజన్ ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు కూడా తమ పూర్తి మద్దతును ప్రకటించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ సీనియర్ నాయకుడు నీరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తామని, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాలను పార్టీతో అనుసంధానం చేసే దిశగా కార్యాచరణ కొనసాగుతోందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రక్షణ సేనను బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన విభాగ ప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జెండా పండుగ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిగాయి. మొయినాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమం తెలంగాణ రక్షణ సేన పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చిందని నాయకులు పేర్కొన్నారు. భారీ జనసమీకరణతో నిర్వహించిన ఈ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా పెద్దపల్లి



పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్/ మే 30/ అక్షరం న్యూస్ –:

బాల్య వివాహాల రహిత జిల్లాగా పెద్దపల్లిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటించారు. పెద్దపల్లి జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనతో పాటు మహిళా సాధికారత, అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన కార్యక్రమాలు విశేష ఫలితాలను సాధించాయని కలెక్టర్ తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్నేహ కిశోర బాలికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విధానాలను రూపొందించడమే ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనమని అన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు లేకుండా బలవంతంగా తీసుకువచ్చే మార్పులు ఎక్కువ కాలం నిలవవని పేర్కొన్నారు. మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించాలని సూచించారు. జిల్లాలోని అన్ని మహిళా సంఘాలలో చదువు రాని మహిళలను ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదు చేసి, 5 వేల మంది వాలంటీర్ల సహకారంతో అక్షరాస్యత బోధించడం జరిగిందన్నారు. మార్చి నెలలో నిర్వహించిన పరీక్షలకు 34,620 మంది మహిళలు హాజరై 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. రాబోయే జూలై నెలలో మిగిలిన 35 వేల మంది మహిళలకు కూడా పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, వాలంటీర్లు, మహిళా సంఘాల సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు, వేధింపులు, వివక్షను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత అధికారులు, స్నేహ కిశోర బాలికల సంఘం సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో ఘనంగా ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



పెద్దపల్లి జిల్లా/ పెద్దపల్లి టౌన్/ మే 30/ అక్షరం న్యూస్ –:

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కమ్మగోని చౌదరి గౌడ్ అధ్వర్యంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం బస్టాండ్ లోని ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌదరి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ ఐటీ రంగాన్ని దేశంలోనే నెంబర్ వన్ చేస్తూ రోజుకి 20 గంటలకు ప్రజలకు సేవలందిస్తూ ప్రజా నేత గా పేరుపొందిన నేతగా ఎదిగిన మన శ్రీధర్ బాబు గారు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి ప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు కోల అనిల్ యాదవ్, యువజన కాంగ్రెస్ పెద్దపల్లి మండల ఉపాధ్యక్షులు అరగొండ రాజ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంద శంకర్, బొడ్డుపల్లి అశోక్, కీర్తి రాజయ్య, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిటవేన వినోద్ యాదవ్,యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం సాయి, కీర్తి హరీష్, మద్దుల ప్రశాంత్, కనుకుంట్ల సదానందం, కరుపాకల రవి, వెంకటేష్, గుర్రాల రాజు, సిరిసిల్ల శంకర్, చిటవేన మోహన్, కాంగ్రెస్ నాయకులు బండి మల్లేష్, పోగుల తిరుపతి యాదవ్, రవితేజ, కొయ్యడ నాగరాజు, చింతల కుమార్, సారంగం, శివ గౌడ్, రమేష్, లోకేష్, రాజ్ కుమార్, అజయ్, రంజిత్, ప్రశాంత్, శ్రవణ్ లు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -30(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండల పరిధిలోని చీకోడ్ పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ బదిలీపై మీరుదొడ్డి మండలము కొండాపూర్ గ్రామానికి బదిలీ పై వెళుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం చీకోడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బొమ్మెన ఆంజనేయులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు.గ్రామ అభివృద్ధికి చేసిన సేవలు ప్రజల తో అయనకున్న సత్సంబంధాలు ప్రస్థావించారు. అనంతరం ఎల్లారెడ్డి పేట్ మండలం నారాయణ పూర్ గ్రామం లో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న భరత్ చీకోడ్ గ్రామానికి బదిలీ పై రావడం తో పంచాయతీ పాలక వర్గం సాధారంగా ఆహ్వానం పలికారు ఈ సందర్భంగా బదిలీ పై వెళ్లిన కార్యదర్శి మాట్లాడుతూ మూడు న్నరసంవత్సరాలుగా సహకరించిన సిబ్బంది ఉద్యోగులకు రుణపడి ఉంటానని అన్నారు ఈ కార్యక్రమం లో సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ పాలక వర్గం పాల్గొన్నారు

# వారణాసి స్టిల్స్ లీక్..జక్కన్న మౌనం






టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు.

## దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాచంకం

అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు.




చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## కరిష్మాకపూర్ తాజా వెబ్ సీరిస్ బ్రౌన్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే పక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.




## అజిత్ కుమార్‌కు మాతృవియోగం

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడు అజిత్ కుమార్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి మోహిని మణి శనివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోసంబంధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. 84 ఏళ్ల మోహిని మణి మరణవార్త తెలిసిన వెంటనే తమిళ సినీ వర్గాలు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో అజిత్ కుమార్‌తో పాటు అనూప్ కుమార్, అనిల్ కుమార్ కూడా ఉన్నారు. కుటుంబ సభ్యులతో ఎంతో ఆప్యాయంగా ఉండే మోహిని మణి మరణం వారి కుటుంబానికి తీరని లోటుగా మారింది.

2023లో అజిత్ తండ్రి పి.ఎస్. మణి అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. తల్లి మరణవార్త అందుకున్న వెంటనే విదేశాల్లో ఉన్న అజిత్ కుమార్ అత్యవసరంగా చెన్నైకి బయలుదేరినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



## పులి-మేకతో రోజా రీ ఎంట్రీ




సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణెళిశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరిఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.

## రికార్డులు తిరగరాస్తున్న కరుప్ప

**300 కోట్ల వసూళ్లను దాటిన మూవీ**




తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.

# ఒంటరిగా కూర్చొని ఏడ్చిన వైభవ్ సూర్యవంశీ..!



ఐపీఎల్ 2026 క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ చేతిలో రాజస్థాన్ రాయల్స్ ఓడిపోయిన తర్వాత.. వైభవ్ సూర్యవంశీ



మైదానంలోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మ్యాచ్‌లో ఒంటరి పోరాటం చేసి 47 బంతుల్లో 96 పరుగులు చేసినప్పటికీ జట్టును ఫైనల్‌కు చేర్చలేకపోయాననే బాధతో డగౌట్‌లో కూర్చుని, తన క్యాప్‌ను ముఖానికి అడ్డుపెట్టుకుని గుక్కపెట్టి ఏడ్చాడు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తృటిలో సెంచరీ మిస్సయినా ఏమాత్రం కుంగిపోని ఈ కుర్రాడు, జట్టు ఓడిపోవడాన్ని మాత్రం తట్టుకోలేకపోయాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ పోరాటం ముగిసింది. వైభవ్ సూర్యవంశీ వీర బాదుడుతో క్వాలిఫయర్-2 వరకు చేరిన ఆ జట్టు.. శుక్రవారం గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వైభవ్ 47 బంతుల్లో 96 రన్స్ చేసినా.. ఓటమిని మాత్రం తప్పించలేకపోయాడు. దీంతో మ్యాచ్ అనంతరం తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. 15 ఏళ్ల వైభవ్.. బ్యాటింగ్‌లో ఎంతో పరిణతి చూపించాడు. ఓపక్క వికెట్లు పడుతున్నా.. పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ చేశాడు. వరుసగా రెండో మ్యాచులో సెంచరీ మిస్ అయినా.. ఏమాత్రం బాధపడలేదు. కానీ మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత మాత్రం గుక్క పెట్టి ఏడ్చాడు!క్వాలిఫయర్-2లో ఓడిపోయిన తర్వాత వైభవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చిన తర్వాత అతడు డకౌట్‌లోకి వెళ్లిపోయాడు. ఒంటరిగా అక్కడే కూర్చొన్నాడు. తన క్యాప్‌ను అడ్డుపెట్టుకుని.. కన్నీళ్లు కార్చాడు. తన జట్టును ఫైనల్ చేర్చలేకపోయామని బాధ అతడి కళ్లలో స్పష్టంగా కనిపించింది. దీంతో లోపలి నుంచి వస్తున్న బాధను అతడు కన్నీళ్ల రూపంలో బయటకు పంపించేశాడు. పాల బుగ్గల ఈ కుర్రాడు.. వెక్కి వెక్కి ఏడ్చాడు!ఇది గమనించిన రాజస్థాన్ రాయల్స్ సపోర్టింగ్ స్టాఫ్.. అతడిని ఓదార్చే ప్రయత్నం చేశారు. కాసేపటికి కోలుకున్న అతడు.. తిరిగి మైదానంలోకి వచ్చి.. అవార్డులు అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటో, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే బాధలో ఉన్నప్పటికీ తనతో ఫొటో కావాలని అడిగిన గ్రౌండ్ స్టాఫ్, పోలీసు సిబ్బందికి అతడు సహకరించాడు. వారందరికీ ఫొటోలు ఇచ్చాడు.నిజానికి ఈ మ్యాచులో సెంచరీ మిస్ అయినా.. వైభవ్ ఇంతలా ఫీల్ కాలేదు. కానీ మ్యాచులో ఓడిపోయిన తర్వాత మాత్రం తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. ఇది చూసిన నెటిజన్లు.. ఇది కదా స్పోర్ట్స్‌మన్ షిప్ అని కామెంట్లు చేస్తున్నారు. వైభవ్.. నిజమైన హీరో అని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఓటమిని మైమరిపించే విజయాలను భవిష్యత్‌లో అందుకుంటాడని కామెంట్లు చేస్తున్నారు.

## భువనేశ్వర్ ఆర్సీబీకి అసలైన 'గేమ్ ఛేంజర్'!



ఐపీఎల్ ఫైనల్ పోరు కోసం బరిలోకి దిగేందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సిద్ధంగా ఉంది. ఈ కీలకమైన మ్యాచ్‌లో కోహ్లీ, పడిక్కల్‌ల బ్యాటింగ్ ఎంత ముఖ్యమో, బౌలింగ్ దళంలోని ఒక ఆటగాడి బాధ్యత కూడా అంతే పెరిగింది. ఫైనల్ పోరులో గుజరాత్ టైటాన్స్‌ని ఓడించి కప్ గెలవాలనే స్పష్టమైన వ్యూహం ఆర్సీబీకి ఉంది. మ్యాచ్‌పై ఉత్సాహం పతాకస్థాయిలో ఉంది, అభిమానులు విజయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లాస్ట్ టైమ్ గెలవడంతో.. మళ్లీ గెలిచి.. "ఈ సాలా కప్ నందే" అనాలని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. క్రికెట్ పండితుల ప్రకారం, ఆర్సీబీ విజయాన్ని ఖాయం చేయడానికి ఫైనల్‌లో భువనేశ్వర్ కుమార్‌కి కేవలం 3 వికెట్లు మాత్రమే అవసరం. తన స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేయగల భువనేశ్వర్ కుమార్ సామర్థ్యం.. ఆర్సీబీ శిబిరంలో కొత్త ఆశలను రేకెత్తించింది. గుజరాత్ జట్టుకి బ్యాటింగ్ అతి పెద్ద ప్లస్ పాయింట్. ఆ బ్యాటింగ్ వెన్నెముకను విరిచేందుకు భువనేశ్వర్ కుమార్ వేసే మొదటి కొన్ని ఓవర్లు కీలకం కానున్నాయి. అది వర్కవుట్ అయితే.. తిరుగుండదు.ఆర్సీబీ గెలవాలంటే.. జీటీ జట్టులోని కీలక ఆటగాళ్లైన సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, జోస్ బట్లర్ వికెట్లు తీసి తీరాలి. ఈ ముగ్గురు ఆటగాళ్లూ క్రీజులో నిలిస్తే, జీటీ భారీ స్కోర్లు సాధించడం సులభం. అందువల్ల, భువనేశ్వర్ కుమార్ తన తెలివైన బౌలింగ్‌తో వారిని త్వరగా ఔట్ చేస్తే, జీటీ జట్టు విజయగాథ గోవిందే అవుతుందనడంలో సందేహం లేదు.ఈ ఉత్కంఠ భరితమైన ఫైనల్.. గుజరాత్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనుంది. టాస్ గెలవాలన్న కెప్టెన్ నిర్ణయం మ్యాచ్ గమనాన్ని మార్చగలదు. అహ్మదాబాద్ పిచ్ ఫాస్ట్ బౌలర్లకు ఎక్కువ సహకారం అందించే అవకాశం ఉంది. ఆదివారం మే 31 నాడు సాయంత్రం 7 గంటలకు టాస్ జరగనుండగా, మ్యాచ్ 7.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఓప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ల బలహీనతలను అర్థం చేసుకుని బౌలింగ్ చేసే భువనేశ్వర్ కుమార్ సామర్థ్యమే ఈ టైటిల్ మ్యాచ్‌కు మలుపు కానుంది. జట్టులోని ఇతర బౌలర్లు కూడా భువనేశ్వర్ కుమార్‌కు మంచి సహకారం అందిస్తే, ఆర్సీబీ విజయ మార్గం సుగమం అవుతుంది.చాలా మంది క్రికెట్ విశ్లేషకులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్సీబీ జట్టు బ్యాటింగ్‌లోనే కాకుండా బౌలింగ్ విభాగంలో కూడా క్రమశిక్షణ చూపిస్తే, జీటీ జట్టు ఆటగాళ్లు కోరుకున్నన్ని పరుగులు చేయలేరు. భువి 3 వికెట్లు తీస్తే, అది జీటీ ఓటమికి దారితీస్తుందని పండితులు కచ్చితంగా చెబుతున్నారు.

## ఐపీఎల్ వేడుకలు పూర్తిగా నిషేధం!!

- బెంగళూరు పోలీసులు సంచలన నిర్ణయం



ఐపీఎల్ 2026 ఫైనల్లో ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడనున్న సంగతి తెలిసిందే. మే 31న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ కీలక మ్యాచ్ జరగనుంది. ఈ క్రమంలోనే ఆర్సీబీ ఫ్రాంచైజీ వరుసగా రెండో ఏడాది కూడా ఐపీఎల్ కప్‌ను ముద్దాడి సరికొత్త రికార్డు సృష్టించాలని అభిమానులు ఎంతగానో ఆశిస్తున్నారు. అయితే ఈ మహాసంగ్రామానికి ముందే బెంగళూరు క్రికెట్ అభిమానులకు అక్కడి పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. నగరంలో బహిరంగంగా ఐపీఎల్ వేడుకలు జరుపుకోవడంపై బెంగళూరు పోలీసులు పూర్తిగా నిషేధం విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.బెంగళూరు పోలీసులు ఇంతటి కఠినమైన నిర్ణయం తీసుకోవడం వెనుక గతేడాది జరిగిన ఓ చేదు అనుభవం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఐపీఎల్ 2025 సీజన్లో ఆర్సీబీ తొలిసారి టైటిల్ గెలిచినప్పుడు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. అయితే ఆ సమయంలో స్టేడియం బయట ఒక్కసారిగా తొక్కిసలాట జరిగి ఏకంగా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అప్పట్లో ఆర్సీబీ యాజమాన్యం వైఫల్యంగా, పోలీసుల నిర్లక్ష్యంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. దీంతో ఈ సారి ఎలాంటి రిస్క్ తీసుకోకూడదని భావించిన బెంగళూరు పోలీస్ శాఖ ముందస్తుగానే కఠినమైన ఆంక్షలను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.బెంగళూరు నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ట్రాఫిక్ జామ్‌లు, అవాంఛనీయ సంఘటనలను అరికట్టడానికి ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా బహిరంగ ప్రదేశాలలో మ్యాచ్‌లు వీక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసే పెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లపై నిషేధం విధించారు. మాల్స్, పబ్‌లు, ఇతర బహిరంగ ప్రదేశాలలో సాధారణ ప్రజల కోసం లైవ్ బ్రాడ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేయవద్దని యాజమాన్యాలను కోరారు. అలాగే రోడ్లపై బైక్ ర్యాలీలు తీయడం, పటాకులు కాల్చడంపై కూడా పూర్తిగా ఆంక్షలు విధించారు.దీంతో పాటు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, గొడవలకు దిగడం వంటి పనులు చేస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని పోలీసులు గట్టిగా హెచ్చరించారు. నగర ప్రజలంతా క్రమశిక్షణతో, ప్రశాంతంగా ఉంటూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కప్ గెలిచిన ఆనందంలో ఉన్న ఆర్సీబీ అభిమానులకు, ఈసారి డబుల్ ధమాకా సెలబ్రేషన్స్ చేసుకోవాలనుకున్న తరుణంలో పోలీసుల నుంచి వచ్చిన ఈ ప్రకటన తీవ్ర నిరాశను మిగిల్చిందనే చెప్పాలి.

# తుది సమరానికి సర్వం సిద్ధం







- రెండోసారి ట్రోఫీని ముద్దాడేది ఎవరు?
- బెంగళూరు, గుజరాత్ మధ్య తుది పోరు
- అహ్మదాబాద్ వేదికగా ఆమీతూమీకి సై

ఐపీఎల్ 2026 తుది సమరానికి సర్వం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని ప్రతిష్టాత్మక నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు ట్రోఫీ కోసం తలపడనున్నాయి. రెండు జట్లూ తమ రెండో ఐపీఎల్ టైటిల్‌పై కన్నేయడంతో ఈ మ్యాచ్ అభిమానుల్లో మునుపెన్నడూ లేని ఉత్కంఠను రేకెత్తిస్తోంది. గుజరాత్ టైటాన్స్ జట్టుకు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఈ అహ్మదాబాద్ మైదానంతో ఒక విడదీయరాని సెంటిమెంట్ ముడిపడి ఉంది. ఇదే పిచ్‌పై 2022లో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించి గుజరాత్ తన తొలి ఐపీఎల్ కప్‌ను ముద్దాడింది. మరోవైపు, సుదీర్ఘ కాలంగా అభిమానులను ఊరించిన ఆర్సీబీ, గత ఏడాది అంటే ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఇదే మైదానంలో మట్టికరిపించి 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి విజేతగా నిలిచింది. ఇప్పుడు ఇరు జట్లూ తమ రెండో ట్రోఫీని గెలుచుకుని లీగ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య ఉన్న హెడ్-టు-హెడ్ రికార్డులు ఎలా ఉన్నాయో పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.ఐపీఎల్ చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు ఇప్పటివరకు మొత్తం 9 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఇందులో ఆర్సీబీ 5 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, గుజరాత్ టైటాన్స్ 4 మ్యాచ్‌ల్లో జయభేరి మోగించింది. ఈ గణాంకాలను బట్టి చూస్తే ఇరు జట్ల మధ్య పోటీ ఎంత హోరాహోరీగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.రికార్డుల పరంగా బెంగళూరు జట్టుకు స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ, గుజరాత్ జట్టు ఏనాడూ వారికి సులువుగా మ్యాచ్‌లను వదిలిపెట్టలేదు. ఇరు జట్లలోనూ ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల దిగ్గజ ఆటగాళు ఉండటంతో, ఈ 2026 ఫైనల్ మ్యాచ్‌లో కూడా పరుగుల సునామీతో పాటు తీవ్రమైన పోరాటం సాగడం ఖాయంగా కనిపిస్తోంది.ఈ సీజన్ లీగ్ దశలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. ఆడిన 14 మ్యాచ్‌లలో 9 విజయాలు, 5 ఓటములతో మొత్తం 18 పాయింట్లు సాధించింది. మెరుగైన నెట్ రన్ రేట్ (o0.783) కారణంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుని నేరుగా క్వాలిఫయర్-1కు దూసుకెళ్లింది. యువ కెప్టెన్ రజత్ పాటిదార్ సారథ్యంలో జట్టు ఎంతో సమతుల్యంగా కనిపిస్తోంది. బ్యాటింగ్ విభాగంలో రజత్ పాటిదార్, దేవదత్ పడిక్కల్, విరాట్ కోహ్లీ నిలకడగా పరుగులు సాధిస్తుండగా, బౌలింగ్‌లో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్నారు. క్వాలిఫయర్-1 లో గుజరాత్‌ను ఓడించి నేరుగా ఫైనల్‌కు చేరిన ఆర్సీబీ, ప్రస్తుత ఫామ్ ప్రకారం టైటిల్ గెలిచే బలమైన జట్టుగా బరిలోకి దిగుతోంది. మరోవైపు శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ సైతం ఈ సీజన్ లీగ్ దశలో 14 మ్యాచ్‌లలో 9 విజయాలు, 5 ఓటములతో 18 పాయింట్లు సాధించి రన్ రేట్ ఆధారంగా రెండో స్థానంలో నిలిచింది. గుజరాత్ జట్టుకు వారి టాప్ ఆర్డర్ బ్యాటింగ్ ప్రధాన బలంగా మారింది. కెప్టెన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్ అద్భుతమైన ఫామ్‌లో ఉంటూ పరుగుల వరద పారిస్తున్నారు. బౌలింగ్ విభాగంలో కాగిసో రబాడా, మహ్మద్ సిరాజ్, రషీద్ ఖాన్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లు ఉన్నారు. క్వాలిఫయర్-1 లో ఆర్సీబీ చేతిలో పరాజయం పాలైనప్పటికీ, పట్టువదలకుండా క్వాలిఫయర్-2 లో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించి గుజరాత్ ఫైనల్లో అడుగుపెట్టింది. పాత పగను తీర్చుకుంటూ రెండోసారి ఛాంపియన్‌గా నిలవాలని గిల్ సేన గట్టి పట్టుదలతో ఉంది. గణాంకాల ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ, ఫైనల్ వంటి భారీ మ్యాచ్‌లో ఏ జట్టు ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటుందనే దానిపైనే విజయం ఆధారపడి ఉంటుంది. సొంత మైదానంలో ఆడుతుండటం గుజరాత్‌కు కలిసివచ్చే అంశమైతే, డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ ఆత్మవిశ్వాసం ఆ జట్టుకు కొండంత బలం. ఈ ఆదివారం రాత్రి అహ్మదాబాద్ వేదికగా జరగబోయే ఈ క్రికెట్ సమరంలో విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి.

# ఆర్‌సీబీతో ఫైనల్లో మాకు ఆ అడ్వాంటేజ్..

### గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ధీమా

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపునకు వచ్చేసింది. ఆదివారం అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. రెండు టీమ్స్ కూడా తమ రెండో ఐపీఎల్ టైటిల్ పై కన్నేశాయి. ఈ మెగా ఫైనల్ కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడాడు. కెప్టెన్ గా తన మొదటి ఐపీఎల్ ట్రోఫీకి అడుగు దూరంలో ఉన్నా, తనపై ఎలాంటి ఎక్స్‌పెక్టేషన్స్ ప్రెజర్ లేదని అతడు స్పష్టం చేశాడు. అహ్మదాబాద్ గ్రౌండ్ తమకు హోం పిచ్ కావడం వల్ల ఇక్కడి వికెట్, గ్రౌండ్ కండిషన్స్ పై పూర్తి అండర్‌స్టాండింగ్ ఉందని గిల్ తెలిపాడు. ఇక్కడ గెలవడానికి ఎలాంటి క్రికెట్ ఆడాలో తమకు బాగా తెలుసని, ఈ ఫెమిలియారిటీ తమకు ఖచ్చితంగా ప్లస్ పాయింట్ అవుతుందని చెప్పాడు. క్వాలిఫైయర్ 2 లో రాజస్థాన్ ను ఓడించి అహ్మదాబాద్ చేరిన తమకు ట్రావెలింగ్ వల్ల కొంచెం అలసట ఉన్నా, ఫైనల్స్ అనేది పూర్తిగా మెంటల్ గేమ్ అని అతడు అన్నాడు. మానసికంగా ఏ టీమ్ స్ట్రాంగ్ గా ఉంటే ఆ జట్టుదే విజయం అని అతడు వివరించాడు. క్వాలిఫైయర్ 1 లో ఆర్‌సీబీ చేతిలో ధర్మశాలలో ఎదురైన ఘోర పరాజయాన్ని తాము మర్చిపోయామని హింట్ ఇచ్చాడు.మిగతా టీమ్స్ లాగా మొదటి బంతి నుంచే హిట్టింగ్ చేయకుండా, వికెట్లు కాపాడుకుంటూ చివర్లో స్కోర్ పెంచే తమ ఓల్డ్ స్కూల్ బ్యాటింగ్ అప్రోచ్ ను గిల్ డిఫెండ్ చేసుకున్నాడు. మ్యాచ్ లో గెలవడం మాత్రమే ముఖ్యం తప్ప, అది ఎలా సాధించామనేది మేటర్ కాదని అన్నాడు. పిచ్ స్లోగా ఉన్నప్పుడు సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోర్ బోర్డును రన్ చేయడం అవసరమని చెప్పాడు. తక్కువ డాట్ బాల్స్ ఆడే టీమ్ కే ఎక్కువ స్కోర్ చేసే ఛాన్స్ ఉంటుందని అతడు అభిప్రాయపడ్డాడు. తన ఓపెనింగ్ పార్ట్ నర్ సాయి సుదర్శన్ తో కలిసి ఇలాంటి సాలిడ్ ఫౌండేషన్ వేయడానికే ట్రై చేస్తానని చెప్పాడు.కొత్త బంతితో బౌలింగ్ చేసేటప్పుడు బ్యాటర్లకు కష్టంగా ఉండే టెస్ట్ మ్యాచ్ గుడ్ లెంగ్త్ ను తమ బౌలర్లు పక్కాగా వాడుతున్నట్లు గిల్ వివరించాడు. క్వాలిఫైయర్ 2 లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని కట్టడి చేయడానికి తాము వాడిన బౌన్సర్ల స్ట్రాటజీ అద్భుతంగా వర్కవుట్ అయిందని అతడు గుర్తు చేశాడు. సూర్యవంశీ 96 రన్స్ చేసినా, తమ బౌలర్లు వేసిన బౌన్సర్ల కచ్చితత్వం వల్ల అతడు ఫ్రీగా ఆడలేకపోయాడని చెప్పాడు. ఇంత పర్ఫెక్ట్ బౌన్సర్లు తాను ఏ టి20 మ్యాచ్ లోనూ చూడలేదని, అదే బౌలింగ్ ప్లాన్ ను ఫైనల్ లో కూడా రిపీట్ చేసి ఆర్‌సీబీని కట్టడి చేస్తామని అతడు సవాల్ విసిరాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609